Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 332 | కరీంనగర్ | బుధవారం 22 ఏప్రిల్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్21 : తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. ఈ బదిలీల పక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40

11లో

## అబద్ధాలు చెప్పడంలో కెసిఆర్ దిట్ట

### మోటర్లకు మీటర్లపై మండిపడ్డ ఎంపి అర్వింద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 21 : వ్యవసాయ మోటర్లకు కరెంట్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ కేంద్రం నిధులతో చేసినవేనని చెప్పారు. కేసీఆర్.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు చేయలేదు. భూముల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు.

11లో

# 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



- తెలంగాణ భవన్‌లోనే సమావేశాలు
- తాజా రాజకీయ పరిణాలపై చర్చించే ఛాన్స్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 21 : భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్దం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశర చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల

11లో

## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

### నార్వే బృందంతో మంత్రి శ్రీధర్ బాబు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 21 : తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్మృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు

11లో

## ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా



- కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
- హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
- కావాలనే కెసిఆర్ సభరోజు సభ పెట్టారు
- కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్21 : బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే ఢిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరపున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరపున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు. రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు. కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా

11లో

## అప్పుడు కెసిఆర్‌కు..ఇప్పుడు రేవంత్‌కు

- ఎటిఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్
- రేవంత్ రాహువు, కేసిఆర్ కేతువు అంటూ బండి విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 21 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ.9వేల కోట్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన

11లో

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్

- పదేళ్లలో అబద్ధాలతోనే పాలన చేశారు
- బిఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ
- రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్గొండ, ఏప్రిల్ 21 : అబద్దాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్దాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్చిన్నమైందని.. ఆపార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా

11లో

## మహిళా బిల్లు వీగడానికి కాంగ్రెస్ కారణం

- రాహుల్ తీరుపై మండిపడ్డ ఎంపి అరుణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 : లోక్‌సభలో ఇటీవలే మహిళల రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కాంగ్రెస్ ప్రధాన ముద్దాయి అని మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. విపక్షాలతో కలసి మహిళా బిల్లును అడ్డుకుని సాధించేదేంటని అన్నారు. బిల్లు వీగిపోవడంతో అధికార ఎన్డీయే పార్టీలు.. ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు మహిళలు అంటే చిన్నచూపని, చట్టసభల్లోకి మహిళలు రావడం అంటే ఇష్టం లేదంటూ ఎన్డీయే పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా విపక్షాలు కుట్రపూరితంగా అడ్డుకున్నాయని ఎంపీ డీకే అరుణ తెలిపారు. దేశాన్ని ఉత్తర, దక్షిణ భారతదేశం పేరుతో విడగొట్టే

11లో

## ఎందరో ఆత్మ బలిదానాలతో తెలంగాణ

- ఏ ఒక్కరి వల్లనో రాలేదు: కడియం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఏప్రిల్ 21 : సకల జనుల పోరాటం, ఎందరో ఆత్మబలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏ ఒక్కరి వల్లనో తెలంగాణ ఏర్పడలేదన్నారు. అయితే దీనిని తానే తెచ్చానని కెసిఆర్ చెప్పుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చిన

11లో

## ఎంపిటిసి, జడ్పిటిసిలకు సిద్ధం కండి

### కాంగ్రెస్ కార్యకర్తలకు దామోదర సూచన




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి,ఏప్రిల్ 21 :ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పార్టీ నేతలకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి మంత్రి దామోదర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాయకుల్లో వర్గపోరు ఉంటే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పదవిని అనుభవించాలని మంత్రి అన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలమని.. కార్యకర్తలే ధైర్యం, స్థైర్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలు, విశ్వాసం తక్కువని... అవకాశవాదం ఎక్కువన్నారు. ఎప్పుడూ శత్రువుని తక్కువ అంచనా వేయకూడదని సూచించారు. 70 వేల ఉద్యోగాలను ప్రభుత్వం ఇప్పటికే భర్తీ చేసిందని వెల్లడించారు. ఆరోగ్య శాఖలో ఇంకో 3 నెలల్లో మొత్తం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం పథకం దేశంలో ఎక్కడా లేదని దామోదర రాజనర్సింహ

11లో

## ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

- ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి
- కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్ 21 : భవిష్యత్‌లో 100 శాతం ఇథనాల్ బ్లెండింగ్ సాధించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. పశ్చిమాసియా సంక్షోభంతో ఇంధన సరఫరాలో ఆటంకాలు ఎదుర్కొంటున్నామని గుర్తుచేశారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరముందన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఇంధన రంగం 87

11లో



## ఆర్టీసీ సమ్మె యధాతథం

### ప్రభుత్వంతో చర్చలు విఫలం

11లో

ప్రజాలక్ష్యం









# విద్యార్థుల్లో సృజనాత్మక వెలికితీతకే పోటీలు

**- పకడ్బందీగా సంక్షేమ వారోత్సవాలు అమలు - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ - ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సంక్షేమ వారోత్సవాల కింద - బద్దెనపల్లి టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులకు వివిధ పోటీలు - ఆకట్టుకున్న చిత్రలేఖనం, డిబేట్ ఇతర పోటీలు - విజేతలకు బహుమతుల అందజేత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 21 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సంక్షేమ వారోత్సవాల కింద విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక వెలికితీతకే పోటీలు నిర్వహించామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంక్షేమ వారోత్సవాల కింద తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ పీఎం శ్రీ విద్యాలయంలో విద్యార్థులకు క్విజ్, డిబేట్, చిత్రలేఖనం తదితర పోటీలు మంగళవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా విద్యార్థుల పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి.. అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించారని, జూన్ 12 వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇప్పటి దాకా చేసిన పనులు వివరిస్తూ.. భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు కార్యక్రమం అమలు చేస్తుందని వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు సంక్షేమ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, అవగాహన కల్పించామని, రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు అమలు, గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని, డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించామని వివరించారు. సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో కిచెన్, స్కూల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామని పేర్కొన్నారు. టాలెంట్ హంట్ లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి.. వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. అన్ని విద్యాలయాలకు కావాల్సిన మరమ్మత్తుల వివరాలు సేకరించి.. ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచిందని, అన్ని విద్యాలయాల్లో కామన్ డైట్ మెనూ అమలు చేస్తుందని వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తరగతి పుస్తకాలతో పాటు దిన పత్రికలు, కథల పుస్తకాలు చదవాలని సూచించారు. ఆటలు లేదా ఏదైనా ఒక రంగంలో బాగా సాధన చేసి.. రాణించాలని పేర్కొన్నారు. పరిసరాల పై అవగాహన ఉండాలని, సోషల్ మీడియా కు దూరంగా ఉండాలని సూచించారు. విలువైన సమయం వృథా చేయవద్దని వివరించారు. విద్యార్థులు అందరూ ఏ నేపథ్యం నుంచి వచ్చినా కూడా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, మంచి స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్, గురుకులాల డీసీఓ థెరిస్సా, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ సిలివేరి లావణ్య, ప్రిన్సిపాల్ బీ పద్మ తదితరులు పాల్గొన్నారు.



# భాగుర్తిపేట క్రాస్ నుంచి బుద్ధారం రోడ్డు పనులు వేగవంతం చేయాలి

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రేగొండ, ఏప్రిల్ 21 : ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలంటే రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. రేగొండ మండలంలోని భాగుర్తిపేట క్రాస్ నుంచి బుద్ధారం గ్రామం వరకు నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను ఆయన మంగళవారం పరి శీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, పురోగతిపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే నిర్మాణం ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కొడవటంచ గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.









# మిషన్ భగీరథ నీటీ సరఫరాలో ఇబ్బందులు రావద్దు

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- అగ్రహారం సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్,**

**- వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, రుద్రవరం ఇన్ టెక్ వెల్ పరిశీలన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వేములవాడ, ఏప్రిల్ 21 : వేసవి కాలం నేపథ్యంలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల పరిధిలో మిషన్ భగీరథ నీరు సరఫరాలో ఇబ్బందులు రాకుండా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారం సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, నీటి శుద్ధి, సరఫరా, రుద్రవరం లోని ఇన్ టెక్ వెల్ ను క్షేత్రస్థాయిలో మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నీటిని శుద్ధి చేసే ప్రక్రియను క్షుణ్ణంగా కలెక్టర్ కు మిషన్ భగీరథ ఇంజనీర్లు వివరించారు. పంపింగ్ సామర్థ్యం, స్టోరేజి వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... ప్రస్తుత వేసవి ఉన్నందున ప్రతి ఇంటికి నల్ల నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజు నీటి శుద్ధి కేంద్రాల నుంచి నీరు సరఫరా జరిగేలా మిషన్ భగీరథ ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యంత్రాల మరమ్మత్తు ఉంటే త్వరితగతిన చేయించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నీటి పారుదల, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో ప్రాజెక్ట్ లలో నీటి మట్టాన్ని పరిశీలిస్తూ.. ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. పరిశీలనలో మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ కార్య నిర్వాహక ఇంజనీర్లు అన్వర్, సుమలత, డీఈ రాము తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

**- సాంప్రదాయ పంటలు తగ్గించి కూరగాయల వైపు దృష్టి సారించాలి - కూరగాయల పంటలకు సబ్సిడీలు అందిస్తున్న ప్రభుత్వం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్, ఏప్రిల్ 21 : సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునని, రైతులు సాంప్రదాయ పంటల నుండి లాభసాటి కూరగాయల సాగు వైపు మళ్లడం ద్వారా ఆర్థికాభివృద్ధి చెందుతారని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సాంప్రదాయ పంటలు తగ్గించి కూరగాయల వైపు దృష్టి సారించాలని కోరారు. కూరగాయల పంటలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుందన్నారు మంగళవారం టేక్మాల్ మండలం చంద్రు తండాలో కలెక్టర్ పర్యటించారు . 256 మంది రైతులు పండిస్తున్న లాభసాటి కూరగాయల సాగును పరిశీలించి. రైతులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు కష్టాన్ని నమ్ముకుని పనిచేస్తారని రైతే దేశానికి వెన్నుముక అనే నినాదానికి నిదర్శనంగా చంద్రు తండా నిలుస్తుంది అన్నారు. సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతూ లాభసాటి కూరగాయల పెంపకంతో కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి చెందడం హర్షించదగ్గ విషయంగా పేర్కొన్నారు. టమాటా, కాకర, చిక్కుడు, సొరకాయ సేంద్రీయ ఎరువులతో పెంచడంతోపాటు, తోటలు కూడా ఎంతో ఆరోగ్యవంతంగా పెరగడం నాణ్యత గల కూరగాయలు రైతులే స్వయంగా మార్కెట్కు తీసుకుని వెళ్లి వ్యాపారం నిర్వహించుకుని లాభాలు పొందుతున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రూపంలో స్ప్రింక్లర్స్ అందించడం జరిగిందని అదేవిధంగా వ్యవసాయ అధికారులు రైతులకు కూరగాయల సాగుకు సంబంధించిన మెలకువలు అందించడం ద్వారా ఆర్థిక చేయూత కలుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.వ్యవసాయ రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా అడుగులు వేస్తూ, సంప్రదాయ మూస పద్ధతులకు స్వస్తి పలుకుతున్న రైతులు ఇప్పుడు లాభాల బాట పడుతున్నారని,ఎంతోమంది రైతులు సాగును లాభసాటి వ్యాపారంగా మలుచుకుంటున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పంటలను పండించే విధంగా అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సర్పంచి స్రవంతి సర్దార్, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఏఈఓ వినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్- ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ - 21: రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం ప్రారంభించారు. ధాన్యం కుప్పలు, తేమ శాతంహా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకొని ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, తహసీల్దార్ సుజాత తదితరులు ఉన్నారు.

# ఆర్టిసి కార్మికుల న్యాయమైన సమ్మెకు యంసిపిఐ(యు) సంపూర్ణ మద్దతు

**రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 21: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా కార్మికుల తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె లోకి వెళ్ళడానికి రాష్ట్ర ప్రభుత్వం యొక్క మొండి వైఖరి కారణం అని సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం యొక్క ద్వంద్వ విధానాన్ని మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నాం అని రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి రాష్ట్ర కార్యాలయం ఓంకార్ భవన్ నుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణ సాధన ఉద్యమంలో సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మిక వర్గం యొక్క పాత్ర అమోఘం అని ఆ లాంటి పోరాట వర్గం యొక్క డిమాండ్లను సానుభూతితో ప్రభుత్వమే చొరవ తీసుకుని పరిష్కారం చూపకుండా సమ్మెకు వెళ్ళె విధంగా నియంతృత్వంగా వ్యవహరించటం కనీస ప్రజాస్వామిక చర్య కాదని పేర్కొన్నారు. గత 10 సంవత్సరాల బిఆర్యస్ పాలనలో ఆర్టీసీ సమ్మెలు రోజుల తరబడి సాగి ఆ ప్రభుత్వం యొక్క నియంత వైఖరి వలన ఆర్టీసీ కార్మికులు గుండెలు ఆగి చని పోయిన చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొండికి పోకుండా సమ్మె నివారణకు కార్మికులతో తక్షణమే చర్చలు జరుపాలని, డిమాండ్స్‌ను పరిష్కారం చేయాలని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థ గా ప్రకటించి తక్షణమే విలీన ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేసారు. ఆర్టీసీలో యూనియన్లు పునరుద్ధరణ చేసి తక్షణమే ఎన్నికలు ప్రజాస్వామ్య పద్దతుల్లో నిర్వహించాలని తెలిపారు. వేతన సవరణ, పిఆర్సీ బకాయిలు, రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి. ఆర్టీసీలో ఎలక్ట్రానిక్ బస్సులు పెంచటాన్ని తక్షణమే ఉపసంహరణ చేయాలన్నారు. వీటితో పాటు కార్మికులు పెట్టిన డిమాండ్‌లను మానవతా కోణంలో పరిష్కారం చేయాలని, సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు





# బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ అండ్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్**

**- సిరిసిల్లలో జనగణన 2027పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల శిక్షణ శిబిరం పరిశీలన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 21 : జనగణన-2027ను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ అండ్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జనగణన 2027లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆఖరి రోజు శిక్షణ కొనసాగుతుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎండాకాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక అంశాల్లో అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్, ఏప్రిల్ - 21 : విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన కల్పించాలని లికలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు ప్రారంభం అయిన నేపథ్యంలో రెండవ రోజు టేక్మాల్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో ఎంపీడీవో, ఎంఈఓతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహంలోని స్టోర్ గది కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రతిభను సృజనాత్మకతలను వెలికి తీయడం మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు వివిధ సబ్జెక్టులలో జ్ఞానాన్ని మరియు శీఘ్ర ఆలోచనా విధానాన్ని పరీక్షించడం కోసం క్విజ్ పోటీలు, బాలల హక్కుల, కార్య క్రమాలు, బాలల హక్కులు, విద్య, ఆరోగ్య అవగాహనపై వీధి నాటకాలు, సామాజిక న్యాయం, విద్య, పర్యావరణం-ఆంగ్లంలో మరియు తెలుగులో చర్చ ప్రసంగాలు సామాజిక న్యాయ, ప్రకృతి, సంస్కృతి అంశాలపై సృజనాత్మక వ్యక్తీకరణపై డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తు న్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది. వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్దతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్షేమం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకులు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప– అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఏపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# డంపింగ్ యార్డ్ రద్దు ప్రజా ఉద్యమం

# రాజకీయ పార్టీల "క్రీడ" గా మారిందా...!






హుజూరాబాద్ పట్టణ కేంద్రంలో అతి ప్రధానమైన ప్రజాసమస్యపై నెల రోజులుగా ప్రజలు చేస్తున్న నిరసన ప్రదర్శనలపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కనీస స్పందన కనబరచకపోవడం పట్ల ప్రజలు తీవ్రమైన అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

హుజూరాబాద్ పట్టణానికి సమీపంలోని సిర్సపల్లి గ్రామ పరిధిలో నిర్మించతలపెట్టిన "వేస్ట్ టు ఎనర్జీ" ప్లాంట్‌ను రద్దు చేసి, హుజూరాబాద్ ప్రాంత ప్రజలను కాపాడాలని అన్నివర్గాల చెందిన ప్రజలు ముప్పై రోజులుగా స్వచ్ఛందంగా ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం (20.04.2026) రోజున భారీ సంఖ్యలో హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన దాదాపు మూడు వందల మంది ప్రజలు అఖిలపక్ష కమిటి నాయకత్వంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో అభ్యర్థన పత్రాలు అందచేయడానికి వెళ్ళారు. కలెక్టర్ కార్యాలయం ముందు ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, సిర్సపల్లి డంపింగ్ యార్డ్ ను రద్దు చేసి, హుజూరాబాద్ ప్రాంత ప్రజల జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు.

ఐతే, ఛలో కరీంనగర్ పేరుతో అఖిలపక్ష కమిటీ ఇచ్చిన పిలుపుకు రాజకీయ పార్టీల స్పందన నామమాత్రంగానే కనిపించింది. అయినప్పటికీ దాదాపు మూడువందల మంది ప్రజలు కరీంనగర్ ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావడం ఉద్యమ ఉధృతికి నిదర్శనం. డంపింగ్ యార్డ్ రద్దు కోసం స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద అఖిలపక్ష కమిటి ఆధ్వర్యంలో ప్రారంభించిన నిరవధిక నిరసన దీక్షలకు తొలి రోజుల్లో అండగా నిలిచిన అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు క్రమంగా తమ వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు పరిమితమౌతూ, ప్రజా ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నాలను ప్రారంభించాయన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రజలు డంపింగ్ యార్డ్ వ్యవహారం తమకు, తమ పిల్లల భవిష్యత్తుకు అత్యంత ప్రమాదం తీసుకువస్తుందన్న విషయాన్ని గ్రహించి రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా హుజురాబాద్ పట్టణం తో సహా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతు సంఘాలు, కుల సంఘాలు, వృత్తి సంఘాలు, మహిళా సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు భారీగా తరలి వచ్చి అఖిలపక్ష కమిటీ ఇచ్చే పిలుపు కు స్పందించి ఉద్యమ ఉధృతిని పెంచుతున్నారు. ప్రజల నుండి స్వచ్ఛందగా వస్తున్న స్పందన పరిగణలోకి తీసుకుని ఉద్యమాన్ని ఎన్ని వ్యయ, ప్రయాసాలు ఎదురైనప్పటికీ డంపింగ్ యార్డ్ రద్ద య్యేంతవరకు ముందుకు నడిపించేందుకు అఖిలపక్ష కమిటీ తన ఉద్యమ వ్యూహాల్ని రచిస్తుంది. ఇది అధికార, ప్రతిపక్ష పార్టీలకు మింగు డుపడడం లేదని ప్రజలే చెపుతున్నారు.

ఈ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి పార్టీలను ప్రజలు సమానంగానే తప్పు పడుతున్నారు. అఖిలపక్ష కమిటి, ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఉద్యమాలు చేసినా డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే బాధ్యత అధికార పార్టీ పైనే వుంటుంది. మొదట్లో ఈ సమస్య పట్ల తీవ్రంగా స్పందించి, పలువురు మంత్రులు, పార్టీ పెద్దల దృష్టికి తీసుకువచ్చిన ఆ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ గత కొన్ని రోజులుగా మౌనంగా ఉంటున్నారన్న వార్తలు ప్రచారంలో ఉన్నాయి. సిరసపల్లి వద్ద ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్ వ్యవహారం రాష్ట్ర ముఖ్యమంత్రి పరిధిలో ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలే చూసుకుంటారు, మనం ఈ విషయంలో పట్టిపట్టనట్టుగా ఉంటేనే మంచిదని రాష్ట్ర కేబినెట్ మంత్రి ఒకరు సలహా ఇవ్వడంవల్లనే సదరు పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మౌనంగా ఉంటున్నారని కూడా ప్రచారం జరుగుతుంది. అతి ప్రధానమైన ప్రజా సమస్యను పరిష్కరించే విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పై కూడా ఒత్తిడిని తీసుకురావలసిన బాధ్యత సంబధిత మంత్రుల పైనా, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పైనా ఉంటుందన్న విషయాన్ని విస్మరిస్తే ఎలా...?

అంతే, కాదు అఖిలపక్ష కమిటీ నిరసనల శిబిరం ప్రతిపక్ష పార్టీలకు అడ్డగా మారిందన్న అసంతృప్తి కూడా అధికార పార్టీలో ఉందన్నది మరో కారణంగా అనుకుంటున్నారు. కారణం ఏదైనా కావచ్చు, కానీ సమస్యను నాన్చడం వల్ల ప్రభుత్వానికి నష్టంవాటిల్లే అవకాశం వుంటుంది. అలాగే ఇంకా జాప్యం చేయడం వల్ల సమస్యను ప్రతిపక్ష పార్టీలకు ఆయుధంగా అధికార పార్టీనే అందించినట్టవతుందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంలో ఇలాంటి జాప్యం చేయడం వల్లనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కూడా, రెండు ప్రాంతాల్లో అధికారాన్ని కోల్పోయిన విషయాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గమనించవలసిఉందని పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు.

ఇక, ప్రతిపక్ష పార్టీల విషయానికి వస్తే, హుజూరాబాద్ ఎమ్మెల్యే, ఈ ప్రాంతానికి చెందిన కరీంనగర్ లోకసభ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి డంపింగ యార్డ్ రద్దు ఉద్యమం ఎంత కాలం కొనసాగితే అంతకన్నా రెట్టింపుగా కాంగ్రెస్ పార్టీని బద్నాం చేస్తే, తమ పార్టీలకు ప్రయోజనం లభిస్తుందనే ఆలోచనలో ఉన్నారే తప్ప, తాము ప్రజా ప్రతినిధులుగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించి, ప్రజా ఉద్యమాన్ని విరమింపచేయడం పై దృష్టి సారించకపోవడం పట్ల ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

డంపింగ్ యార్డ్ రద్దయ్యేంతవరకు తాను ఉద్యమాన్ని కొసాగిస్తానని పదే పదే చెప్పే ఎమ్మెల్యే తాను ప్రజాప్రతినిధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లకపోడం పట్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పార్టీల కోసం పనిచేయడం వేరు, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన తర్వాత పనిచేసే విధానం వేరన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించవలసివుంది. కేవలం తమ పార్టీ మేలు కోసమే ప్రజల సమస్యను పట్టించుకుంటానన్న ఎమ్మెల్యే ధోరణి ప్రజలకు మేలు చేసేది కాదు.

ఇక్కడ ఒక ప్రధానమైన సమస్య పై గత ముప్పై రోజులుగా ప్రజా ఉద్యమం కొనసాగుతుంటే, ఆ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దలవద్దకు నియోజకవర్గం ప్రజా ప్రతినిధిగా సరైన ప్రాతినిధ్యం వహించడం లేదన్న అపవాదును ఎమ్మెల్యే ఎదుర్కొంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలతో పార్టీ పరమైన వైషమ్యాలు ఎమ్మెల్యేకు ఉంటే ఉండవచ్చు, కానీ, ప్రజాప్రతిధిగా తన బాధ్యతలను నిర్వహించవసి ఉంటుందన్న విషయాన్ని విస్మరించకూడదు కదా...!

హుజూరాబాద్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ లోకసభ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి మరో అడుగు ముందుకు వేసి, సోమవారం నాడు తనను కలిసిన హుజూరాబాద్ ప్రాంత బిజేపీ కార్యకర్తలతో మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ రద్దయ్యేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపు ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేసింది.

డంపింగ్ యార్డు ఉద్యమం ఇంకా తీవ్రమైతే తమ పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని ఆయన భావన కావచ్చు...కానీ,

ఒక ప్రజా ప్రతినిధిగా, కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న నాయకుడు డంపింగ్ యార్డ్ నిర్మాణ సమస్య పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించలేని దుర్భరమైన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.

హుజూరాబాద్ లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజలను కేవలం ఓట్ల రాజకీయం చుట్టూ తిప్పుతున్నారే తప్ప హుజూరాబాద్ ప్రాంత ప్రజలు ముప్పై రోజులకు పైగా తీవ్రమైన ఎండలను సైతం లెక్క చేయకుండా ఆందోళనలు కొనసాగిస్తుంటే, ప్రజల బాధలను సంబంధిత పాలకుల దృష్టికి తీసుకుపోవడంలో విఫలమవ్వడం పట్ల ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా, వివిధ పార్టీల ముఖ్యులు కొందరు రాష్ట్ర స్థాయి అధికారులకు డంపింగ్ యార్డ్ రద్దు కోసం విజ్ఞాపనలు అందచేస్తూ, సదరు ఫోటోలను మీడియాలో ప్రచారం చేసుకుంటూ, తాము సంబంధిత సమస్యపై పనిచేస్తున్నామన్న సంకేతాన్ని ప్రజల్లోకి పంపి అక్కడితో ఆగిపోవడం దురదృష్టకరం. ఇక్కడి కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్. పార్టీలు డంపింగ్ యార్డ్ రద్దు వ్యవహారాన్ని తమ పార్టీల రాజకీయ "క్రీడ" గా ఉపయోగించుకుంటున్నాయని అన్ని వర్గాల నుండి వినిపిస్తున్న విమర్శలు...

ఇక, ఇరవై రోజుల క్రితమే కలెక్టర్ కు అఖిలపక్ష కమిటి స్వయంగా కలసి డంపింగ యార్డ్ రద్దు కోసం విజ్ఞాపన పత్రాలు అందచేశారు. సమస్యను తాము పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని జిల్లా అధికార యంత్రాంగం చేతులు దులుపుకుంటుంది.

కరీంనగర్ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఈ విషయమై కనీస స్పందన తెలుపకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగ అధిపతిగా కలెక్టర్ కనీసం డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించకపోవడం, అలాగే ప్రజలు చేస్తున్న ఉద్యమ పట్ల స్పందించి, ప్రజలకు కనీస భరోసాను కల్పించకపోవడం అధికార యంత్రాంగ వైఫల్యంగా కనిపిస్తుంది. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం కనీసం ప్రజలకు డంపింగ్ యార్డ్ వల్ల లాభమో, నష్టమో ఈ ప్రాంత ప్రజలకు కనీస అవగాహన కల్పించటానికి కూడా ప్రయత్నించకపోవడం ప్రజా సేవకులుగా తమ బాధ్యతలను విస్మరించడమేనని సర్వత్రా వినిపిస్తుంది.

ప్రజా ప్రభుత్వం అని పదే పదే చెప్పుకుంటున్న ప్రభుత్వం హుజూరాబాద్ ప్రాంత ప్రజలు డంపింగ్ యార్డ్ రద్దు కోసం చేస్తున్న ఉద్యమాన్ని కనీసం పట్టించుకోకపోవడం అప్రజాస్వామికం.

అన్ని రాజకీయ పార్టీలు డంపింగ్ యార్డ్ రద్దు కోసం జరుగుతున్న ఉద్యమానికి అండగా నిలుస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం "ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉంది" అన్న చందంగా మారి, అన్ని వర్గాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా మారింది. ప్రజలు ఆందోళనగా కనిపిస్తున్నారు... రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు హుజూరాబాద్ ప్రాంతంపై సవతితల్లి ప్రేమను కనబరుస్తున్నారన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడివల్లనే అధికార యంత్రాంగం డంపింగ్ యార్డ్ విషయమై పల్లెత్తు మాట మాట్లాడటం లేకుండా పోయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇకపోతే, డంపింగ్ యార్డ్ వ్యవహారంపై ఎంత కాలం ఉద్య మాలు కొనసాగితే ప్రభుత్వానికి అంత ప్రజావ్యతిరేకత పెరగాలని ప్రతి పక్షాలు చూస్తున్నాయి. మరో విషాదకరమైన విషయమేమి టంటే, కొందరు నిరసన దీక్షల శిబిరాన్ని గెస్ట్‌లుగా సందర్శించి, తాము ఉద్యమ బాధ్యతలు స్వీకరించి ముందుంటామని గంభీరమైన ఉపన్యాసాలు ఇచ్చి ఎప్పుడోసారి దర్శనమిస్తున్నారు. మరికొంత మంది నిరసన దీక్షలు ప్రారంభమైన వెంటనే మైక్ అందుకుని మాట్లాడి, ఫోటోలకు ఫోజులిచ్చి అక్కడి నుండి జారుకుంటున్నారు. ఒకవైపు రాజకీయ పార్టీలవ్యవహారం, మరోవైపు పైన పేర్కొన్న గెస్ట్‌ల దర్శనాలను సమన్వయం చేయడం అఖిలపక్ష కమిటీ బాధ్యులకు నిత్య దినచర్యగా మారుతుంది...!

అలాగే అఖిలపక్ష కమిటీ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నప్పటికీ, కొన్నిరాజకీయ పార్టీలను అభిమానించే వ్యక్తులు అఖిలపక్షం కమిటీ పై దుష్ప్రచారానికి పాల్పడి, ఉద్యమాన్ని నీరుగార్చేందుకు యత్నిస్తు న్నట్టుగా వినికిడి. అయినప్పటికీ, అఖిలపక్ష కమిటీ నాయకులు తొందర పాటు చర్యలకు పాల్పడకుండా, ప్రజల నుండి వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకుని ఎంతో ఓపికతో డంపింగ్ యార్డ్ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తున్న తీరు అభినంద నీయం... అలాగే, ప్రజల జీవన్మరణ సమస్యగా దాపురించినడంపింగ్ యార్డ్‌ను రద్దు చేస్తు న్నట్టుగా ప్రభుత్వం ప్రకటిం చేంతవరకు హుజూరాబాద్ ప్రాంత ప్రజలు సంఘటితంగా ఉద్యమించాలని, ఉద్యమిస్తారని ఆశిస్తున్నాను...



– ఆవునూరి సమ్మయ్య,
తెలంగాణ ఉద్యమకారుడు.

## సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు సెటిలింగ్ అలవెన్స్ పెంపు వర్తింప చేయాలి

### సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 21: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు సెటిలింగ్ అలవెన్స్ పెంపును వర్తింప చేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రాళ్లబండి రాజన్న ఒక సంయుక్త ప్రకటనలో యాజమాన్యాన్ని కోరారు. కోల్ ఇండియా లిమిటెడ్ సంస్థలో నాన్–ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలో చెల్లించే సెటిలింగ్ అలవెన్స్ ను రూ.12,000 నుంచి రూ.20,000కు పెంచిన నిర్ణయం స్వాగతించదగినదని వారు పేర్కొన్నారు.

ఇదే విధంగా ఈ ప్రయోజనాన్ని సింగరేణి కాలరీస్ కంపనీ లిమిటెడ్ లో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని వారు కోరారు. 2025 ఆగస్టు 20న విడుదల చేసిన ఆఫీస్ మెమో ప్రకారం, జూలై 31, 2025న జరిగిన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు గుర్తు చేశారు. కంపెనీ క్వార్టర్స్ లేదా లీజ్ ఇండ్లలో నివసిస్తున్న ఉద్యోగులు, నివాసాన్ని ఖాళీ చేసినట్లు ధృవీకరణ పత్రం సమర్పించిన తరువాత మాత్రమే ఈ అలవెన్స్ పొందగలరని తెలిపారు. ప్రతి వేజ్ బోర్డ్ ఒప్పందంలో భత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, 1-7-2021 నుంచి అమల్లోకి వచ్చిన 11వ వేజ్ బోర్డ్ ఒప్పందం 2023 మేలో పూర్తయిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో 11వ వేజ్ బోర్డ్ కాలంలో పదవీ విరమణ పొందిన కార్మికులకు పెరిగిన సెటిలింగ్ అలవెన్స్ బకాయిలను కూడా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో దీర్ఘకాలం సేవలందించిన కార్మికులకు సమాన హక్కులు, ప్రయోజనాలు కల్పించడం అత్యవసరమని వారు అభిప్రాయపడ్డారు. కోల్ ఇండియా ఉద్యోగులకు లభిస్తున్న సదుపాయాలు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కూడా అందించడం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. సింగరేణి యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకుని సెటిలింగ్ అలవెన్స్ పెంపును అమలు చేయాలని వారు ఈ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ రెడ్డి "యాక్సిడెంటల్ ముఖ్యమంత్రి"

## - సీఎం రేవంత్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది
## - భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 21 : రేవంత్ రెడ్డి "యాక్సిడెంటల్ ముఖ్యమంత్రి" అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులతో కాకుండా పరిస్థితుల వల్ల ఆ పదవికి చేరుకున్నారని పేర్కొన్నారు. అందరూ ఆయనలా "తొక్కుకుంటూ" ఎదగలేరని విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సీఎం నిర్వహిస్తున్న సభలు ప్రజా ధనం వృథా చేయడమే తప్ప ప్రజలకు ఉపయోగం లేదని ఆరోపించారు. "మళ్లీ నేనే ముఖ్యమంత్రి అవుతాను" అని చెప్పడం సరైంది



కాదని, ఆ నిర్ణయం పూర్తిగా ప్రజలదేనని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలవుతుందని, కొడంగల్ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి డిపాజిట్ కూడా కోల్పోతారని ఎద్దేవా చేశారు. అదేవిధంగా, కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణలో సాగు, త్రాగునీటి అవసరాలను తీర్చే కీలక ప్రాజెక్ట్ అని అందరికీ తెలిసిందేనన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం విచారణల పేరుతో ఆలస్యం చేస్తూ ప్రాజెక్ట్ పునరుద్ధరణను నిర్లక్ష్యం చేస్తోందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన తీర్పు ఇస్తారని పేర్కొన్నారు.





# హనుమాన్ దీక్షలతో ఆలయాలు అంతా నామమయం

## - మే 11 చిన్న హనుమాన్ జయంతి - మండల దీక్షలతో ఆలయాల్లో సందడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 21 : కొండగట్టు అంజన్న కోరిన కోర్కెలు తీర్చే దేవుడని నమ్మే భక్తజనం పెద్ద జయంతికి 41 రోజులు అంజన్న మాలాధారణ ధరించి స్వాములు నియమ నిష్ఠలతో నిత్యం పూజలు చేస్తూ కొండగట్టు అంజన్న వద్దకు వెళ్లి మాలలు విరమిస్తారు. పెద్ద జయంతి అనంతరం మే 11న వస్తున్న హనుమాన్ చిన్న జయంతి అత్యంత భక్తులకు ఆరాధ్య దైవంగా భావిస్తారు. చిన్న జయంతికి 41, 21, 11 రోజుల మండల దీక్షలను అంజన్న భక్తులు మాల ధారణ తీసుకోవడం అన వాయితిగా వస్తోంది. మంగళవారం హనుమాన్ దినంగా భక్తులు భావిస్తారు. అందుకే ఈరోజు ప్రతి సీతారామ హనుమాన్ ఆలయాల్లో భారీ ఎత్తున అంజన్న మాల ధారణ చేశారు. ప్రతి ఆలయంలో పదుల సంఖ్యలో హనుమాన్ మాల ధారణ భక్తులు ఆలయాలకు రావడంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మాలధారణ స్వాములు' సీతారామలక్షణ పవనసుత హనుమాన్ కి, జై అంటూ చేసిన అంజన్న శరణఘోషతో మారు మ్రోగాయి. హనుమాన్ చిన్న జయంతి మే 11 వరకు అన్ని ఆలయాల్లో నిత్య పూజలు హనుమాన్ శరణు ఘోష రాత్రి భజన భక్తి గీతాలతో ఆధ్యాత్మికత వెల్లి విరుస్తుంది. మాలధారణ స్వాములకు హనుమాన్ భక్తులు అన్న ప్రసాదం అల్పాహారం పాలు పండ్లు లాంటివి అందిస్తూ నమ్ముకున్న అంజన్నకు మొక్కులు చెల్లించుకోవడం హనుమాన్ మాల ధారణ ప్రత్యేకత ఉదయం పండు పాలు మధ్యాహ్నం భిక్ష రాత్రి తక్కువ మోతాదులో పండ్లు పాలు మాలధారణ స్వాములు స్వీకరిస్తారు. హనుమాన్ భక్తజనం ఆలయాల్లో హనుమాన్ మాల ధారణ లో ఉన్న స్వాములకు సహకార సేవా రూపంలో నడుచుకుంటూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు దాతలు ఈ మండల మాలధారణ సందర్భంగా భారీగా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సంగారెడ్డి ఏప్రిల్ 21 : (ప్రజాలక్ష్యం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని రెడ్లస్ హోటల్ లో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలజగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని అన్నారు, నాయకుల్లో వర్గపోరు ఉంటే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉంది కాబట్టి అందరూ కలిసి కట్టుగా ఉండి పార్టీ విజయానికి పాటు పడాలని అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని నేడు నేతలు పదవులు అనుభవిస్తున్నారు, అలాగే పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పదవి అనుభవించాలి. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్, తోపాజి అనంతకిషన్, శశికళరెడ్డి, సునీత హన్మంత్ రావ్ పాటిల్,చిన్నా,కాట సుధారాణి రాంరెడ్డి, ప్రభు, సేవా దళ్ సభ్యులు మున్సిపల్ చైర్మన్లు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు..



# ప్రజల్లో పోలీస్ శాఖ పై విశ్వాసం పెంపొందించాలి

## జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 21 : ప్రజల్లో పోలీస్ శాఖ పై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని జయశంకర్–భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లాలోని మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళ వారం ఎస్పీ సంకీర్త్ సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడం ఈ తనిఖీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా "వన మహోత్సవం" కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం స్టేషన్ ప్రాంగణ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. అలాగే స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ధాన్యం కొనుగోలు నిర్వహించాలి

## - భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ - బూర్గంపహాడ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఏప్రిల్ 21 : రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వారంలో భాగంగా మంగళవారం భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ బూర్గంపహాడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం బూర్గంపహాడ్ వ్యవసాయ కమిటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యాలయం తనిఖీ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్యా కార్యక్రమాల అమలు, పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు పాఠశాలలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్, డ్రాయింగ్ పోటీలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని , మరింత విస్తృతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని సదుపాయాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల కిచెన్ షెడ్‌ను పరిశీలించి, మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తాజా కూరగాయల వినియోగం, ఆహార తయారీ, వడ్డింపులో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అలాగే పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలపై కూడా ఆరా తీశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, మాయిశ్చర్ మీటర్ ద్వారా తేమ శాతాన్ని తనిఖీ చేశారు. ధాన్యం నాణ్యత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.



కొనుగోలు ప్రక్రియ పురోగతి, పెండింగ్ ధాన్యం వివరాలు తెలుసుకుని, సన్న మరియు దొడ్డు రకం ధాన్యాల కొనుగోలుకు వేర్వేరు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని, లైటింగ్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని అధికారులను ఆదేశించారు. పి.ఆర్–126 దొడ్డు రకం ధాన్యం నాణ్యతపై రైతులు వ్యక్తం చేసిన సందేహాలపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి, పిన్‌పాయింట్ డ్యామేజ్ సమస్యపై పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో స్పష్టత తీసుకువచ్చి రైతులకు నష్టం కలగకుండా చూడాలని తెలిపారు ప్రతి రైతు వద్ద ఉన్న చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, ఎవరూ నష్టపోకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు రిజిస్టర్, రసీదు పుస్తకాలను పరిశీలించి నమోదు విధానాన్ని సమీక్షించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఎంపీడీవో జమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన భార్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 21 : కుటుంబ కలహాలతో భార్య కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన ఘటన పాపన్నపేట మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో చోటు చేసుకుంది. పాపన్నపేట ఏఎస్సై తుక్కయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి....పొడ్చన్ పల్లి తండాకు చెందిన మాలోత్ కిషన్ (60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. మద్యం మత్తులో తరచూ ఇంట్లో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. సోమవారం రాత్రి సమయంలో కిషన్ మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న భార్య మాలి, కొడుకు వినోద్‌తో గొడవ చోటు చేసుకుంది. కిషన్‌ను అంతమోదిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని భార్య మాలి, కొడుకు వినోద్‌లు ఈ క్రమంలో భార్య మాలి, కొడుకు వినోద్‌లు కిషన్‌ను కింద పడేసి చేతులతో బాగా కొట్టారు. మాలి కిషన్ కాళ్లు గట్టిగా పట్టుకోగా వినోద్ కిషన్ గొంతు నొక్కి హత్య చేసి ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడేశారు. కొంత సేపటికి అటుగా వెళ్లిన స్థానికులు నీటి తొట్టిలో పడి ఉన్న కిషన్‌ను గమనించి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. కిషన్ మృతి పట్ల అనుమానం రావడంతో మాలి, వినోద్‌లను నిలదీయగా హత్య చేసిన విషయం తెలిసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి కూతురు లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

# స్పష్టమైన ప్రణాళికతో విద్యా సంవత్సరాన్ని ప్రారంభించాలి

## భద్రాద్రి జిల్లా డీఈఓ బి.నాగలక్ష్మి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఏప్రిల్ 21 : ఈ విద్యా సంవత్సరం జరిగిన ప్రగతిని సమీక్షించుకొని స్పష్టమైన ప్రణాళికతో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి తగు చర్యలు తీసు కోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి అన్నారు. జిల్లా విద్యాశాఖ మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో మంగళవారం భద్రాద్రి కలెక్టరేట్ మీటింగ్ హాల్లో జరిగిన సంవత్సరాంత సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం ప్రాథమిక స్థాయిలో ఎఫ్ఎల్ఎన్, ఉన్నత స్థాయిలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమంలో జరిగిన ప్రగతిని, లోటుపాట్లను సమీక్షించుకొని వచ్చే విద్యా సంవత్సరం ఉన్నతమైన ఫలితాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. విద్యాశాఖలో జరిగే వివిధ కార్యక్రమాలైన పాఠశాల వారి విద్యార్థుల నమోదు, మూతబడిన పాఠశాలను తిరిగి తెరిపించడం, అదేవిధంగా గత సంవత్సరానికి ఈ సంవత్సరానికి నమోదులో మార్పు, పిల్లల ఆధార్, అపార్ పరిస్థితి, ప్రతి పాఠశాల యొక్క మౌలిక వసతుల లభ్యత మొదలగు అంశాలపై ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ వచ్చే విద్యా సంవత్సరానికి ఎటువంటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పని చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. అదేవిధంగా పాఠశాలల్లో పెండింగ్లో ఉన్న మరమ్మతులు, నిర్మాణ పనులపై కూడా ఆయా ఇంజనీరింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో కలిపి సమీక్ష చేశారు. ఈ సంవత్సరం ప్రాథమిక స్థాయిలో ఎఫ్ఎల్ఎన్, ఉన్నత స్థాయిలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమం, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పాఠశాలలను సందర్శించిన



వివరాలు మొదలగు వాటిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి చూపించి ఈ సంవత్సరం ఫలితాలను బేరీజు వేసుకొని వచ్చే సంవత్సరం 100 శాతం ఫలితాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పిల్లలు వేసవి సెలవులలో అభ్యసన ప్రక్రియకు దూరం కాకుండా ఉండటానికి వారికి 45 రోజులు పాటు ఎటువంటి రాత పనిని ఇవ్వాలో దిశా నిర్దేశం చేస్తూ పిల్లలందరూ ఈ రాత పనిలో నిమగ్నం అయ్యే విధముగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, దానికై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని విద్యార్థుల్లో అభ్యసన లోపం లేకుండా చూడాలని కోరారు. వివిధ మండలాల్లో భవిత భవనాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పిల్లలకి అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్.కే.సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్.సతీష్ కుమార్, బాలిక విద్యా కోఆర్డినేటర్ జే.అన్నామని, జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

## గ్రామ సర్పంచ్ నిరుడి దాస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ ఏప్రిల్ 21 : టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామానికి చెందిన ఆవుసుల వెంకటేశం వయస్సు (46) కుటుంబ సభ్యులు జీవనోపాధి కోసం హైదరాబాద్ కు వలస వెళ్లి కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు. ఈనెల 16వ తేదీ ఉదయం ఎన్‌హెచ్ 161 జాతీయ రహదారిపై బులేరా వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయాలు అయ్యాయి. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కోసం హైదరాబాద్ లోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నిరుడి దాస్ తన వంతుగా మృతిని అంత్యక్రియలకోసం కుటుంబ సభ్యులకు రూ.10వేలు రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో నిరుపేద కుటుంబలకు ఏదైనా ఆపద వస్తే తనవంతు ఆర్థికసాయం ఎల్లప్పుడూ ఉంటుందన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎంపీ సుధాకర్, గ్రామస్తులు తుపాకీ ఆంజనేయులు, మోహనగారి యాదగిరి, దాసరి తుమ్మలేషం, జెట్టిగారి సాయిలు, ఎంపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 21: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ముదిగొండ మండలం వనం వారి కిష్టాపురం గ్రామంలో విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన, డీసీసీ మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు మధ్యవర్తుల దోపిడీకి గురికాకుండా నేరుగా ప్రభుత్వానికి తమ పంటను విక్రయించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి.)కు పంట కొనుగోలు జరుగుతుందని హామీ ఇచ్చారు. రైతులు తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పంటను తీసుకురావాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన



ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మతేకేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరావు, వైస్ చైర్మన్ పర్సాగాని తిరుపతిరావు, సర్పంచ్ సరళా, ముత్తారం సర్పంచ్ మమత, పసుపులేటి దేవేందర్, సామినేని వెంకటేశ్వరరావు, పల్లిపాటి కృష్ణ, మల్లెల అజయ్, బందెల నాగార్జున, చిలకల రామకృష్ణ, పుల్లారెడ్డి, వట్టికూటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## రామగుండం రైల్వే స్టేషన్ సందర్శించిన డిఎం గోపాలకృష్ణన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 21 : సికింద్రాబాద్ నుంచి మంగళ వారం రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణ రామగుండం రైల్వే స్టేషన్ సందర్శించారు. రైల్వే స్టేషన్లో సౌకర్యాలు సమస్యలపై సంబంధిత రైల్వే శాఖ అధికారులను డివిజనల్ మేనేజర్ గోపాల కృష్ణన్ అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా డివిజనల్ రైల్వే మెంబర్ అను మాస శ్రీనివాస్ జీన్స్ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు రైల్వే స్టేషన్ రెండవ ఫ్లాట్ ఫారంపై మరుగుదొడ్ల నిర్మాణం చేయించాలని బల్లా ర్షా నుంచి కాజీపేట వైపు నడుస్తున్న సూపర్ ఫాస్ట్ రైళ్లను రవీంద్ర ఖని కొలనూర్ నిలపాలని ప్యాసింజర్ రైలును బల్లార్షా నుంచి సికింద్రాబాద్ వరకు పొడిగిస్తూ సమయం వేళలు మార్చాలని తాను సమర్పించిన వినతి పత్రంలో పెర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని శ్రీనివాస్ జీన్స్ అన్నారు.రైల్వే డిఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 : జిల్లా ఉపాధి కార్యాలయం, మహబూబాబాద్ ఆధ్వర్యంలో ఆదర్శ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బయ్యారం,డోర్నకల్,మహబూబాబాద్ నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలీ కాలర్ ఖాళీల కోసం 18 నుండి 30 సంవత్సరాల వయసు కలిగిన ఇంటర్, డిగ్రీ చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యో గవకాశాలను కల్పించుట కోసం ఈ నెల 23న జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.రజిత మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఆసక్తి కల్గిన అభ్యర్థులు 23 నాడు మహబూబాబాద్‌లో జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాల యం, రూమ్ నెం.25, రెండవ అంతస్తు లో జరిగే ఎంపికలకు ఉదయం 10.30 గం.లనుండి మధ్యాన్నం 2.00 గంటల వరకు అన్ని విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూంతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## రెండవ రోజు సంక్షేమ వారోత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 : ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం,సంక్షేమ వారోత్సవాలు,రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనప కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో,కొత్తగూడెం మండల కేంద్రం ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్,జిల్లా పరిషత్ సీఈవో మహాత్మ జ్యోతిరావు పూలే పత్తిపాక లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రతి మండల పరిధిలోని హాస్టళ్లకు ప్రత్యేక అధికారులను నియమించి సంక్షేమ వారోత్సవా లను పకడ్బందీగా నిర్వహించడం కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మంగళవారం జిల్లాలో ప్రత్యేక ఆదికారుల పర్యటన వివరలు..ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు తెలంగాణ మైనారిటీ హై స్కూల్ మహబూబాబాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, ఆశ్రమ పాఠశాల, మహాత్మ జ్యోతిరావు పూలే వసతి గృహం, నెల్లికుదురు మండలం ఎస్సీ హాస్టల్ ప్రత్యేక అధికారి జి.మరియాన్న,ఎస్సీ బాయ్స్ హాస్టల్ కొరవి అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ మురళి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్ కోసం నోటిఫికేషన్ విడుదల



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 21 : మండలంలోని బూరుగూడ గ్రామ శివారులో ఉన్న గిరిజన మహిళా డిగ్రీ కళాశాల (బాలికలు)లో డిగ్రీలో చేరేందుకు అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. శారద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ అడ్మిషన్ల కోసం ప్రతి ఏడాది మాదిరిగానే దోస్త్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి విడతలో ఈనెల 15 నుండి వచ్చేనెల ఏడవ తేదీ లోగా తొలి విడత దరఖాస్తుల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిలు సంబంధిత పత్రాలతో కళాశాలలో సంప్రదించవచ్చని అన్నారు.

## గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

### కళాశాల ప్రిన్సిపల్ పి.సుధాకృష్ణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 21 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశానికి ఈనెల 6వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని హాసన్ పర్తి గురుకుల కళాశాల ప్రిన్సిపల్ పి.సుధా కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలు హాజరైన విద్యార్థిని, విద్యార్థులు ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు సిఓఈ వృత్తి విద్యలు సైనిక కళాశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ,ఎంఈసి, సీఈసీ, హెచ్ఈసి మొదలైన గ్రూపులలో ప్రవేశం పొందవచ్చు అని తెలిపారు పూర్తి వివరాల కోసం సమీపంలోని గురుకుల కళాశాలలో సంప్రదించవచ్చని హసన్పర్తి ప్రిన్సిపల్ పి.సుధాకృష్ణ పేర్కొన్నారు.





## విద్యతోపాటు సామాజిక అంశాల్లో అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 : విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు ప్రారంభం అయిన నేపథ్యంలో రెండవ రోజు మహాత్మ జ్యోతిరావు పూలే, పత్తిపాక లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహాన్ని పరిశీలించారు,కిచెన్ క్లీనింగ్, సానిటేషన్, హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, పరిసరాల పరిశు భ్రత, హెల్మెట్ సీట్ బెల్ట్ రోడ్డు భద్రత, డ్రగ్స్ నివారణ తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు.సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రతిభను సృజనాత్మకతలను వెలికి తీయడం మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు వివిధ సబ్జెక్టులలో జ్ఞానాన్ని మరియు శీఘ్ర ఆలోచనా విధానాన్ని పరీక్షించడం కోసం క్విజ్ పోటీలు, బాలల హక్కుల, కార్యక్రమాలు, బాలల హక్కులు, విద్య మరియు ఆరోగ్య అవగాహనపై వీధి నాటకాలు,సామాజిక న్యాయం, విద్య మరియు పర్యావరణం - ఆంగ్లంలో మరియు తెలుగులో చర్చ ప్రసంగాలు సామాజిక న్యాయ, ప్రకృతి మరియు సంస్కృతి అంశాలపై సృజనాత్మక వ్యక్తీకరణ పై డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటర్మీడియట్ మొదటి,రెండవ సంవత్సరం లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. రోడ్డు భద్రత, డ్రగ్స్ నివారణ సామాజిక అంశాలపై నిర్వహించిన వ్యాసరచన క్విజ్ పోటీలలో గెలుపొందిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జెడ్పీ సీఈఓ పురుషోత్తం, కళాశాల ప్రిన్సిపల్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ

### రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (మంగపేట) ఏప్రిల్ 21 : మంగపేట గ్రామ పరిధిలోని శాంతినగర్ గుత్తి కోయ గుంపులోని అంగన్వాడీ చిన్నారులకు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి అదనపు జత ఏకరూప దుస్తులను మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,పిల్లలను పనిచేసే ప్రదేశాలకు తీసుకెళ్లవద్దని సూచించారు.గుత్తి కోయ ఆవాసంలోని పిల్లలు సక్రమంగా అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతూ ఆటపాటలతో కూడిన ప్రీ-ప్రైమరీ విద్యను అభ్యసించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం,ప్రీ-స్కూల్ విద్య ప్రభుత్వం అందిస్తుందని,ప్రతి చిన్నారి శారీరక,మానసిక వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలు



కల్పిస్తామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,డి డబ్ల్యు ఓ ప్రేమలత, అంగన్వాడి సూపర్వైజర్,జిల్లా అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ నాయకత్వమే తెలంగాణ భవిష్యత్తుకు గ్యారంటీ

### - మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం - మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 21 : తెలంగాణ భవిష్యత్తుకు కె. చంద్రశేఖర్ రావు నాయకత్వమే గ్యారంటీ అని బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పాల్వంచలోని తన స్వగృహంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తలు, నాయకులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సంస్థాగత బలోపేతంపై స్పష్టమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ, బూత్ స్థాయిలో బలమైన కమిటీల నిర్మాణమే రాబోయే ఎన్నికల్లో విజయానికి పునాది అవుతుందని స్పష్టం చేశారు. రాబోయేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ గెలుపును ఏ శక్తి కూడా అడ్డుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని ఆయన ఆరోపించారు. భావోద్వేగంతో మాట్లాడిన వనమా, "నా చివరి కోరిక...మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడడమే!" అని చెప్పడంతో సభలో ఉన్న కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం నింపింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్, సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, మల్లెల రవిచంద్ర, పాల్వంచ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, కాంపెల్లి కనకేష్, మండల అధ్యక్షులు పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి, కార్పొరేటర్లు బత్తుల మధుచంద్, సింధూ తపస్వి, గుగులోత్ రాంబాబు, గోవాడ గుణచరిత్, మహిళ అధ్యక్షురాలు బట్టు మంజుల, నాయకులు కేటీపీఎస్ ఆర్కే,ముత్యాలప్రవీణ్,దాసరి నాగేశ్వరరావు, మిరియాల అలివేలు, అల్లిసాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మురళి నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21: మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని 9వ వార్డు శనిగాపురంలో భువనేశ్వరి వారిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ ప్రారంభించరు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు పెద్దపీట వేసిందని అంతేకాకుండా రైతులు పండించిన వారి దాన్యం పంటకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ని కూడా ఇస్తుందని రైతు భరోసా నిధులు కూడా ఇస్తుందని అన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు కేంద్రనికి తీసుకురావాలని ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకే అమ్ముకోవాలని, దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ ,



శనిగాపురం మాజీ కౌన్సిలర్ హరి నాయక్,మాజీ కౌన్సిలర్ ,గుగులోత్ శ్రీను,కాంగ్రెస్ పార్టీ పట్టణ కౌన్సిలర్లు, సాల్వాయి దిలీప్, గాడి పెల్లి చరణ్ ,వ్యవసాయ శాఖ అధికారి ఏఈ,వెంట మార్క్ ఫెడ్ అధికారులు, పిఎసిఎస్ అధికారులు,వ్యవసాయ శాఖ అధికారులు, వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జనగణనకు జిల్లా ప్రజలందరూ సహకరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 : జనగణన 2027 మొదటి దశ గృహ గణన, గృహ పరిస్థితుల లెక్కింపు వచ్చే నెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించబడనుందని దీనికి ముందు, ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు స్వీయ గణన సదుపాయం https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా ఈ నెల 26 నుండి మే 10వ తేది వరకు జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ గృహ, కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్,అదనపు జనగణన అధికారి కె.అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడానికి మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారా నైనానమోదు చేసుకోవచ్చని అన్నారు. నమోదు పూర్త యిన తర్వాత, ఒక యూనిక్ కోడ్ వస్తుందని దీన్ని మీ ఇంటికి వచ్చిన గణనాధికారికు చూపించలని అన్నారు. దీని ద్వారా గణన ప్రక్రియ వేగవంతం చేయడంలో మిరు సహకరించిన వారవుతారని అన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకు ఉద్యోగులు, ఐటీ రంగ ఉద్యోగులు, ఇతర వర్గాల వారు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పర్యావరణ సంరక్షణే లక్ష్యం - జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, ఏప్రిల్ 21: అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని, "99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను మంగళవారం కలెక్ట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండుతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. "భూమిని కాపాడుకుందాం", "ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం", "పచ్చదనం పెంచుదాం" వంటి నినాదాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.అలాగే, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్ల పెంపకం చేపట్టడం, నీటి వనరులను సంరక్షించడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ




తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యువత పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే భూమి సంరక్షణ సాధ్యమవుతుందని, పర్యావరణ హిత చర్యలను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఎన్జిసి జిల్లా సమన్వయ కర్త మాధవ రెడ్డి, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఆహ్వానం

### - విజయవంతానికి పూర్తి సహకారం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 21 : కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించి సమ్మేళనం కమిటీ సభ్యులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాంబశివరావు సమ్మేళనం కార్యక్రమానికి శుభాకాంక్షలు తెలియజేసి, కార్యక్రమం విజయవంతం కావడానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, హిందూ సమ్మేళనం కార్యక్రమం రాజకీయాలకు అతీతంగా, హిందూ సమాజ ఐక్యత, ధర్మ పరిరక్షణ, సాంస్కృతిక విలువల బలోపేతం కోసం నిర్వహించబడుతున్నదని పేర్కొన్నారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీలకు చెందిన హిందువులందరిని ఈ సమ్మేళనంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయవలసిందిగా కమిటీ విజ్ఞప్తి చేసింది.



## బిఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామిళ్ళ మురళి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెట్టిపేట, ఏప్రిల్ 21 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామిల్ల మురళి ని నియమించినట్టు అనంతరం వారికి నియామక పత్రాన్ని అందజేసినట్టు బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జి కాదాసి రవీందర్, జిల్లా ఈసి మెంబర్ నాగుల కిరణ్ బాబు,తదితరులు పాల్గొన్నారు.



## విశ్వప్రసాదరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 21: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు మాతృమూర్తి మరణవార్త తెలుసుకున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మంచిర్యాలలోని ఆయన నివాసానికి వెళ్లి విశ్వప్రసాద్ రావును పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ఎం. సరస్వతి, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, మాజీ సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు సయ్యద్ ,నిసార్, సమద్, జీవన్, సందీప్, బలరాం నాయక్ విశ్వప్రసాదరావును కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాతృమూర్తిని కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ ఓదార్చారు. అలాగే విశ్వప్రసాదరావును పరామర్శించిన వారిలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్‌తో పాటు తదితరులు ఉన్నారు. వీరంతా విశ్వప్రసాదరావును పరామర్శించి మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.



## వయోజన విద్యాకేంద్రాలు ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెట్టిపేట, ఏప్రిల్ 21 : మహాత్మా జ్యోతిబాపూలే చేసిన వయోజనుల సేవలు మరువలేనివని హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ అధ్యక్షులు బొడ్డు చరణ్ తేజ పేర్కొన్నారు. మంగళవారం లక్షేటిపేట మండలంలోని గుల్లకోట గ్రామంలో వయోజన విద్యా కేంద్రాలను హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ సభ్యులతో కలసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ లిటరసీ ఇండియా ట్రస్ట్ చెన్నై వారి సహాయ సహకారాలతో 15వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వయోజనులను అక్షరాస్యు లుగా తీర్చిదిద్దడానికి మరియు నిరక్షరాస్యతను రూపుమాపి మహిళ లను, సమాజాన్ని అక్షరాస్యత దిశగా నడిపించాలనేది ఏకైక లక్ష్య మని అన్నారు. వయోజన విద్య కేంద్రాలను ప్రారంభించడం ఆనం దంగా ఉందన్నారు. జ్యోతిబాపూలే మొట్టమొదటిసారిగా వయోజన విద్య కేంద్రాలను ప్రారంభించారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ అధ్యక్షులు బొడ్డు చరణ్ తేజ,ముఖ్య అతిథులుగా అడ్వకేట్ సుధాకర్ పాల్, బొడ్డు రవి జోసెఫ్,గుల్లకోట గ్రామ సర్పంచ్ దేవి దేవమణి, జిల్లపల్లి ప్రభుదాస్,శాంసన్, సుస్మిత,వార్డు సభ్యులు ఆవునూరి స్వప్న,శ్యామల దొండ కళ్యాణి, మల్లికా, రాజేశ్వరి, సరిత, శ్రీవాణి, ప్రేమల,పద్మారావు, లచ్చయ్య, గ్రామప్రజలు పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 21 : మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు మంత్రి సీతక్క కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మంగళవారం ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో రాయినిగూడెం గ్రామానికి చెందిన పది మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,దాత చంద్రమౌళితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ శనివారం ములుగు మండలం రాయినిగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో స్థానిక మహిళలు తమ సమస్యను విన్నవించారని తెలిపారు. కుట్టు మిషన్ నేర్చుకున్నప్పటికీ మిషన్లు లేకపోవడంతో ఉపాధి పొందలేక ఇబ్బంది పడుతున్నామని,కుట్టు మిషన్లు అందిస్తే ఉపాధి దొరుకుతుందని వారు కోరారని చెప్పారు. వెంటనే స్పందించిన మంత్రి సీతక్క రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహాయ సహకారంతో రాయినిగూడెం గ్రామానికి చెందిన పది మంది మహిళలకు,మంగపేట మండలం దోమేడ గ్రామానికి చెందిన 15 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించడంతో పాటు మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పేద మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు విస్తరాకుల తయారీ యంత్రాలు, గ్లాసుల తయారీ యంత్రాలు, కుట్టు మిషన్లు వంటివి దాతల సహకారంతో అందిస్తున్నామని వివరించారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి కుట్టు మిషన్లను విరాళంగా అందించిన రోటరీ క్లబ్ ప్రతినిధి చంద్రమౌళి, ఇతర దాతలకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్,డీడబ్ల్యూఓ ప్రేమలత, రోటరీ క్లబ్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సీఎస్ఆర్ నిధుల వినియోగంపై విమర్శలు

## - టిబిజికేఎస్ కు నైతిక హక్కు లేదు - మండిపడ్డ ఐఎన్టీయూసీ బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ మధుకర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 21:సింగరేణి సీఎస్ఆర్ నిధుల వినియోగంపై విమర్శించే నైతిక హక్కు టిబిజికేఎస్ నాయకులకు లేదని ఐఎన్టీయూసీ బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ మధుకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భూపాలపల్లి సింగరేణి ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిన సీఎస్ఆర్ నిధులను హైదరాబాద్, సిద్ధిపేట్ తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వంటి పనులకు వినియోగించడం అప్పట్లో టిబిజికేఎస్ నాయకులకు కనిపించలేదా? అని మధుకర్ రెడ్డి ప్రశ్నించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన అంశాలపై మాట్లాడే నైతిక హక్కు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి లేదని తీవ్రంగా విమర్శించారు. శ్రీరాంపూర్‌లో జరిగిన సభ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాల్గొన్నప్పుడు, సింగరేణి వివిధ ఏరియాలకు చెందిన మైన్స్ మరియు విభాగాల నుంచి ఉద్యోగులను మస్టర్ వేయించి తీసుకువెళ్లలేదా? దీనివల్ల కంపెనీకి ఎంత నష్టం జరిగిందో గుర్తు చేసుకోవాలని అన్నారు. సింగరేణి సంస్థ ఏపి జెన్కో, ట్రాన్స్ కోలకు బొగ్గు సరఫరా చేసిన బకాయిలు కూడా ప్రభుత్వాల నుంచే రావాల్సి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత హెడ్‌క్వార్టర్స్ ఉన్న ప్రాంతాల్లో సింగరేణి ఆస్తులను ప్రభుత్వ కార్యాలయాల కోసం ఎన్నో సంవత్సరాలు వినియోగించుకున్న విషయాన్ని కూడా గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో సింగరేణి సంస్థపై విమర్శలు చేయడం తగదని, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా స్ట్రక్చర్ కమిటీ సభ్యులు అశోక్, షేక్ హుస్సేన్, బ్రాంచ్ సెక్రటరీలు కుడుదుల శంకర్, రవి కిరణ్, బీసీ-ఓబీసీ బ్రాంచ్ సెక్రటరీ కోరుట్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రణాళికాబద్ధంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలి

## భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 21 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, సమయపాలనతో అమలు చేస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఈఆర్వోలు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), సూపర్వైజర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 70 శాతం ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 30 శాతం పనులను అత్యంత ప్రాధాన్యంతో వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా, పోలింగ్ బూతుల వారీగా మ్యాపింగ్ పురోగతిని సమగ్రంగా విశ్లేషిస్తూ, ప్రతి ప్రాంతంలో పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మణుగూరు మండలంలో కేవలం 37 శాతం మాత్రమే మ్యాపింగ్ పూర్తవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ఆలస్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రాంతంలో ఉద్యోగస్తులు బదిలీ అవ్వడం లేదా వేరొక చోటకి వెళ్లి స్థిరపడటం వంటి కారణాలతో మ్యాపింగ్ ప్రక్రియ ఆలస్యమైందని త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రతి బీఎల్ఓకు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సక్రమంగా పర్యటిస్తూ, ప్రతి గృహానికి చేరుకుని ఖచ్చితమైన వివరాలను సేకరించి మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్న మండలాలు, పోలింగ్ బూతుల వారీగా ప్రత్యేక దృష్టి సారించి, పనిలో జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. అవసరమైన సిబ్బంది, సాంకేతిక లేదా ఇతర సహకారం అవసరమైతే ఆలస్యం చేయకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం తప్పనిసరిగా పాటించాలని, ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి స్థాయిలో డేటా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాధా బైనమా దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా వేగవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి, ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ సూచించారు.



# రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అప్రమత్తం కావాలి

## - ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## - భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 21 : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముందుగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. పలు కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేసి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించేందుకు సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని, ప్రతి కేసులో బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. పోక్సో కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా కృషి చేయాలని, గంజాయి అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే వ్యక్తులపై చట్టపరంగా కఠినంగా వ్యవహరించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వేసవి సెలవుల నేపథ్యంలో దొంగతనాలు నివారించేందుకు గస్తీ, పెట్రోలింగ్‌ను పెంచాలని సూచించారు.




బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే షీ టీమ్స్, భరోసా కేంద్రాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, బాధిత మహిళలకు అండగా నిలవాలని తెలిపారు. ఈ సమావేశంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ అశోక్, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ సీఐ సర్వయ్య, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ రాము, ఏవో మంజ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 21: ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ జిల్లాలో 2 వారాలలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతిలతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల తహసిల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సెర్ప్ ఎపిఎంలు, విఓఎలు, సూపర్వైజర్లతో మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ప్రారంభమవుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో ఓటరును 2002 సంవత్సరం ఓటరు జాబితాకు మ్యాపింగ్ చేయాలని, ఇంకా మ్యాపింగ్ కానీ ఓటరు వివరాలు సేకరించి వారు ఇక్కడి నుంచి వచ్చారు వివరాలతో పోల్చుకొని



భారత ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా మ్యాపింగ్ చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియను వేగంగా చేయడంలో పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, విఓఎలు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేసే మ్యాపింగ్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. ప్రతిరోజు మాపింగ్ ప్రక్రియపై పురోగతి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వి ఓ ఎ లు, సూపర్వైజర్లు, సెర్ప్ ఎ పి ఎం లు తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం

## టీజీఎన్పీడీసీఎల్ ఎండి కర్నాటి వరుణ్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 21 : వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్-కం-మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృతంగా పర్యటించి, జరుగుతున్న విద్యుత్ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇల్లందు మండలం ఒడ్డుగూడెం గ్రామంలోని నూతన పౌల్ట్రీ ఫామ్‌ను సందర్శించిన సీఎండీ, కొత్తగా విద్యుత్ కనెక్షన్ పొందిన లబ్ధిదారుడు వీరభద్రరావుతో మాట్లాడారు. కనెక్షన్ పొందే ప్రక్రియలో సిబ్బంది పనితీరుపై వివరాలు తెలుసుకుని, వినియోగదారుడు వ్యక్తం చేసిన సంతృప్తిపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించారు. వేసవికాలంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా నాణ్యమైన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపట్నంలో నిర్మాణంలో ఉన్న జిల్లా స్టోర్స్ ప్రాంగణాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణం వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పర్యటన సందర్భంగా జిల్లాలోని విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, సేవల మెరుగుదలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ జీ. మహేందర్, కొత్తగూడెం డివిజనల్ ఇంజనీర్, ఎంఆర్టీ డీఈ, ఏఏఓ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 21 : వడగండ్ల వానకు పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలనీ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపీఎం) జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి కలలో కురిసిన వడగండ్ల వానకు వరి పంట,మామిడి పంట వందల ఎకరాలు పంట నష్టం జరిగిందని ఆమె అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ళముందే వడగండ్ల వానకు పాడైతే రైతులు గుండెలు బాదుకుంటున్నారన్నారు. చేతికి వచ్చిన పంట మరో వారం, పది రోజులలో ఇంటికొచ్చే పంట,అనేక తెగుళ్ల నుండి కాపాడుకొని చివరి టైంలో మామిడి పంటలు వర్షం కారణంగా దెబ్బతినడం వల్ల రైతుల కళ్ళల్లో కన్నీరే మిగిలిందన్నారు. అప్పులు చేసి పంట పండిస్తే చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక రైతన్నలు తలలు పట్టుకొని ఏడుస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్షం కారణంగా దెబ్బతిన్న వరి,మామిడి పంటలను వాటి నష్టాన్ని వేల కట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. ఉరుములు, మెరుపులతో అకాల వర్షాలు కురుస్తున్నందున కోసిన వరి పంట ను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతులకు భరోసా ఇచ్చి ఆదుకోవాలన్నారు.



# 200 రూపాయల కోసం ప్రాణం తీసిన నేరస్తుడు అరెస్టు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెట్టిపేట, ఏప్రిల్ 21 200రూపాయల అడిగితే ఇవ్వనందుకు ఇనుప రాడ్డుతో కొట్టి ప్రాణం తీసిన నేరస్తుడిని అరెస్టు చేసిన పోలీసులు. మంగళవారం దండేపల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల ఎసిపి ఆర్.ప్రకాష్ మాట్లాడుతూ ముత్యంపేట గ్రామానికి చెందిన తుర్పాటి కనకయ్య అనే వ్యక్తి అదే గ్రామనికి చెందిన కిరాణం షాపు యజమాని బిల్లా శంకరయ్య షాప్ కు వెళ్లి తన రేషన్ కార్డు ఉంచుకొని 200రూపాయలు ఇవ్వమని అడగగా డబ్బులు లేవు వెళ్ళిపో అన్నందుకు కక్ష పెంచుకొని షాప్ ముందు బట్టలు తగలపెడుతుండగా వద్దని శంకరయ్య అతని భార్య కళావతి అడ్డుకున్నందుకు కనకయ్య తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో శంకరయ్యను కడుపుపై కొట్టి తన భార్యను తల వెనుక భాగంలో కొట్టాడు. అది చూసిన చుట్టుప్రక్కల వారు అడ్డుకోవడానికి రాగా వారిని చూసి పారిపోయాడు. శంకరయ్య అతని భార్య కళావతి లను హాస్పిటల్ కు తరలించగా శంకరయ్య సోమవారం మృతి చెందాడు. పరారైన నేరస్థుడు తుర్పాటి కనకయ్య గురించి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఎల్లారం గ్రామం వద్ద అతడిని పట్టుకున్నట్టు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన లక్షేటిపేట సిఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్సై తైసీనుద్దీన్, లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్, పోలీస్ సిబ్బంది మల్లేష్, శ్రీకాంత్,వసంత్, గణేష్, శ్రీనివాస్, కుమార్,నగేష్, సత్యనారాయణ లను రామగుండం సిపి అంబార్ కిషోర్ ఝ, డీసీపీ ఏగ్గడి భాస్కర్, ఏసీపీ ప్రకాష్ అభినందించారు.

# ఆర్టిసి సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి మద్దతు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 21 : ఆర్టిసి కార్మికులు బుధవారం నుంచి తలపెట్టిన సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి ఖమ్మం జిల్లా కమిటీలు పూర్తి స్థాయి మద్దతు ప్రకటించాయి. ఆర్టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం -పరిశీలించకపోవడం వల్లే సమ్మె అనివార్య మైందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ప్రభుత్వం ఆర్టిసి కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం, సాచివేత ధోరణిని అవలంభించిందని అందుకే కార్మికులు సమ్మెకు దిగకతప్పలేదని సురేష్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి వెంటనే కార్మికులతో చర్చించి సమస్యను-పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టిసిలో విలీనం, పిఆర్సి చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని-ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి, ఇతర ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నాయని ఆర్టిసి కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని సిపిఐ, ఏఐటియుసి నాయకులు పిలుపునిచ్చారు. సమ్మెకు పూర్తి మద్దతు నిస్తున్నట్లు ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు తెలిపారు.

# సమ్మె, సంక్షోభం, సంస్కరణలు... ఆర్టీసీ భవిష్యత్తు ఎటు...?



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

భారతదేశ సామాజిక ముఖచిత్రంలో ప్రజా రవాణా వ్యవస్థ అక్షరాలా కోట్లాది మంది సామాన్యుల జీవన గమనానికి వెన్నెముక వంటిది. ముఖ్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు కేవలం రవాణా సాధనాలు మాత్రమే కావు, అవి గ్రామీణ భారతాన్ని పట్టణ ప్రగతితో అనుసంధానించే జీవనాడులు. నిరుపేదలు, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారులు తమ దైనందిన అవసరాల కోసం ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడతారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, పరిపాలనా పరమైన వైఫల్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వెరసి కార్మిక సమ్మెలకు దారితీస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె అనేది కేవలం వేతనాల పెంపు కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు, అది ప్రజా రవాణా వ్యవస్థ మనుగడ కోసం, సామాన్యుడి ప్రయాణ హక్కు కోసం ఉద్భవించిన ఒక పెను సామాజిక-ఆర్థిక ఉద్యమంగా పరిగణించాల్సి ఉంటుంది.

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో 1950వ దశకంలో ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ సంస్థలు ఆవిర్భవించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ, నవ్యాంధ్ర వరకు ఆర్టీసీ సేవలు అజరామరమైనవి. నాడు లాభసాటిగా సాగిన ఈ ప్రయాణం క్రమంగా నష్టాల బాట పట్టడానికి ప్రధాన కారణం పెరిగిన ఇంధన ధరలు మరియు ప్రభుత్వాల పన్నుల విధానం. డీజిల్ ధరలు లీటరుకు 100 రూపాయలకు పైగా చేరుకుంటున్నా, సామాన్యుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో టికెట్ ధరలను వలసిన విధంగా పెంచక పోవడం సంస్థకు భారంగా మారింది. దీనికి తోడు ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణా వల్ల సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆర్టీసీ నిర్వహణలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ఉచిత పాస్‌లు సంస్థ ఆర్థిక సంక్షోభానికి మరో ప్రధాన కారణం. ఉదాహరణకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు, వృద్ధులకు ఇచ్చే రాయితీల భారం ఏటా వందల కోట్లలో ఉంటుంది. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సకాలంలో రీయంబర్స్ చేయక పోవడం వల్ల సంస్థ అప్పుల ఊబిలో కూరుకు పోతోంది. గణాంకాల ప్రకారం, ఒక్క తెలంగాణ ఆర్టీసీపైనే గతంలో సుమారు 5,000 కోట్ల రూపాయలకు పైగా అప్పులు ఉండగా, నెలవారీ నష్టం 50 నుండి 80 కోట్ల రూపాయల వరకు నమోదవుతూ వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుమారు 48,000 నుండి 50,000 మంది ఉద్యోగులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కేవలం వాహనాలను నడపడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు బాధ్యత వహిస్తున్నారు. అయితే పని ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, సరైన వైద్య సౌకర్యాలు అందకపోవడం వంటి అంశాలు వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2019లో తెలంగాణలో జరిగిన చారిత్రాత్మక ఆర్టీసీ సమ్మె ఈ సమస్యల తీవ్రతకు నిలువుటద్దం. 52 రోజుల పాటు సాగిన ఆ సమ్మెలో దాదాపు 50,000 మంది కార్మికులు తమ హక్కుల కోసం వీరోచితంగా పోరాడారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి, దీనివల్ల రోజుకు 10 నుండి 15 కోట్ల రూపాయల ఆదాయం సంస్థ కోల్పోయింది.

సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించడానికి కేవలం సమ్మెలు పరిష్కారం కావు, ప్రభుత్వం మరియు యజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఆర్టీసీని ఒక వ్యాపార సంస్థగా కాకుండా సామాజిక సేవా సంస్థగా చూడాలి. ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా, పన్ను రాయితీలు కల్పించాలి. డీజిల్‌పై వాట్ (వ్యాట్) తగ్గించడం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయల వ్యయాన్ని ఆదా చేయవచ్చు. అలాగే పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చు కోవాలి. ప్రస్తుతం టికెట్ ఆదాయం కాకుండా ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే తెలంగాణ ఆర్టీసీ ప్రారంభించిన 'కార్గో మరియు పార్శిల్' సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రోజుకు సుమారు 50 నుండి 70 లక్షల రూపాయల వరకు అదనపు ఆదాయం ఈ సేవల ద్వారా సమకూరుతోంది.

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం మరొక కీలక సంస్కరణ. కిలోమీటరుకు డీజిల్ బస్సుతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సు నిర్వహణ ఖర్చు 30% నుండి 40% వరకు తక్కువగా ఉంటుంది. పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా ఇంధన భారాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ వంటి నగరాల్లో వందలాది ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం శుభపరిణామం. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను చేపట్టింది. ఇది కార్మికుల దశాబ్దాల కాలపు కల. దీనివల్ల సుమారు 43,000 మందికి పైగా కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొంది, ఉద్యోగ భద్రత మరియు సరైన వేతన సవరణ పొందే అవకాశం ఏర్పడింది.

అయితే, సంస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూనే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం సవాలుతో కూడుకున్న పని. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టడం, ప్రయాణికుల కోసం మొబైల్ యాప్‌ల ద్వారా లైవ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు సంస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతాయి. కార్మికులతో యజమాన్యం నిరంతరం చర్చలు జరుపుతూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఒక పటిష్టమైన గ్రీవెన్స్ మెకానిజంను ఏర్పాటు చేయాలి. అప్పుడే సమ్మెల వంటి తీవ్ర నిర్ణయాలకు తావుండదు. ప్రజల అవసరాలు, కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వం ఈ మూడింటి మధ్య సమతుల్యత దెబ్బతిన్నప్పుడే సంక్షోభాలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆధునిక సంస్కరణలు మరియు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తేనే ఆర్టీసీ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. భావి తరాలకు భరోసా ఇచ్చేలా, సామాన్యుడి ముంగిట ఎర్ర బస్సు



నిరంతరం పరుగులు తీయాలంటే సంకల్పం మరియు సమష్టి కృషి అనివార్యం. సమ్మెలు తాత్కాలిక సెగను రేపవచ్చు, కానీ చర్చలు మరియు సంస్కరణలు మాత్రమే శాశ్వత వెలుగును నింపుతాయి. ఆర్టీసీ మనుగడ అనేది కేవలం ఒక ఆర్థిక అంశం కాదు, అది లక్షలాది కుటుంబాల జీవనోపాధి మరియు కోట్ల మంది సామాన్యుల కనీస రవాణా హక్కు. వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు కాకుండా, ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఆధునీకరించడం ద్వారా మాత్రమే సుస్థిరమైన పురోగతి సాధ్యమవుతుంది.

ప్రస్తుత తరుణంలో ఏప్రిల్ 22 నుండి కార్మికులు చేపడుతామని చెపుతున్న సమ్మెను నివారించాలంటే ప్రభుత్వం కార్మికుల సాధ్యాసాధ్యమైన కోర్కెలను సానుకూలంగా పరిశీలించాల్సి ఉంది. ఆర్టీసీని కాపాడుకోవడం అంటే సామాన్యుడి ప్రయాణాన్ని కాపాడుకోవడమే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా సంస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం పాలకుల ప్రాథమిక బాధ్యత. బస్సు చక్రం ఆగిపోతే అభివృద్ధి కుంటుపడుతుంది, అదే చక్రం ప్రగతి పథంలో సాగితే సమాజం అంతా సుభిక్షంగా ఉంటుంది.


అందుకే ఆర్టీసీ భవిష్యత్తు అనేది కేవలం సంస్కరణలపైనే కాక, ప్రభుత్వ చిత్తశుద్ధి మరియు కార్మికుల అంకితభావంపై ఆధారపడి ఉంది. సమగ్ర ప్రణాళికలతో సంస్థను బలోపేతం చేసి, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఆర్టీసీని మళ్ళీ అగ్రగామిగా నిలబెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశ్రామిక శాంతి నెలకొన్నప్పుడే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయి, సంస్థ కూడా లాభాల బాట పడుతుంది.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

## ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

### - సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు-హక్కుల సాధనకు ఐక్య పోరాటం అవసరం

### - కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 21 : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెకు సిపిఐ రాష్ట్ర సమితి తరఫున ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ట్రేడ్ యూనియన్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేసి, గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన రెండు వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని, 2013 వేతన సవరణ బకాయిలను విడుదల చేయాలని పేర్కొన్నారు. సంస్థ మనుగడతో పాటు ప్రయాణికుల భద్రత కోసం కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికులకు పని భద్రత కల్పిస్తూ, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం సమ్మెను నివారించాలని సూచించారు. కార్మికుల న్యాయమైన కోరికలు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని, సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుకునే ఈ పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

**"సమ్మెతో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి"**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**



న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మె పాలకులకు గుణపాఠం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు డిపోల నుంచి ఒక్క బస్సు కూడా బయటకు వెళ్లకుండా కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమ్మె శాంతియుతంగా, సంపూర్ణంగా విజయవంతం కావడానికి సిపిఐ, ప్రజాసంఘాల శ్రేణులు కృషి చేయాలని ఆయన కోరారు.

## బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి

### తెలంగాణ రాష్ట్ర జన గణన డైరెక్టర్ భారతి హోలీకెరీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 21 : జనగణన-2027ను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జనగణ డైరెక్టర్ భారతి హోలీకెరీ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జనగణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్,సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్)పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని,రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎండా కాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా ప్రతిమా సింగ్, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి,మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి ,ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## మే 5, 6 తేదీల్లో అన్నపురెడ్డిపల్లికి చిన్న జీయర్ స్వామి రాక

### - బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవం

### - వికాస తరంగిణి జిల్లా అధ్యక్షురాలు దేవినేని రోజా రమణి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మే 5, 6 తేదీల్లో నిర్వహించనున్న మహా కుంభాభిషేక మహోత్సవానికి చిన్న జీయర్ స్వామి విచ్చేయనున్నారని వికాస తరంగిణి జిల్లా అధ్యక్షురాలు దేవినేని రోజా రమణి తెలిపారు. మంగళవారం పాల్వంచలో మీడియాతో మాట్లాడిన ఆమె, మే 1 నుండి 6 వరకు ఆలయంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మే 1న ప్రతిష్ఠామూర్తుల గ్రామోత్సవం, అంకురార్పణం, 2న అరణిమంథనం, అగ్ని ప్రతిష్ఠ, వాస్తు శాంతి, జలాధివాసం, 3న కర్మాంగస్నపనం, శయ్యాధివాసం, 4న అభిషేకం, తత్త్వన్యాస హోమం, గర్తపూజ, రత్నన్యాసం, యంత్ర, బింబ స్థాపన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మే 5న చిన్న జీయర్ స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆయన ప్రవచనం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ ప్రవచనాలను భక్తిశ్రద్ధలతో ఆలకించాలని కోరారు. మే 6న ఉదయం మహాపూర్ణాహుతి అనంతరం మూల నక్షత్రయుక్త మిథున లగ్న సుముహూర్తంలో ఉదయం 9:43 గంటలకు చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా మహా కుంభ ప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు మహా అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే తులసి దళాలతో సహస్రనామార్చన, సహస్ర కుంకుమార్చన, మల్లెలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల ఆలయంలో ఈవో పాకాల వెంకట రమణ, అర్చకులు ప్రసాదాచార్యులు, సిబ్బంది మరియు హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఈ పవిత్ర మహోత్సవానికి భక్తులు కుటుంబ సమేతంగా హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆమె కోరారు.



## మర్లపాడులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఏప్రిల్ 21 : మొక్కజొన్న రైతులకు ఊరటనిచ్చే విధంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈ కేంద్రం ద్వారా రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వానికి తమ పంటను విక్రయించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2400 చెల్లించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని చైర్మన్ దోమ ఆనందబాబు పేర్కొన్నారు. ఇప్పటివరకు తక్కువ ధరలకు పంట అమ్ముకోవాల్సి వచ్చిందని, ఇకపై సరైన మద్దతు ధర లభిస్తుందని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ద్వారా తమకు ఆర్థికంగా ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా వెంకటాపురం గ్రామంలో కూడా ఇలాంటి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేయగా, దీనిని మంత్రి దృష్టికి తీసుకెళ్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాణిక్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, వెల్ది జగన్ మోహన్ రావు, గణపతి రెడ్డి, రంగారెడ్డి, మందపాటి రాఘవరెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, గొర్ల సంజీవరెడ్డి, సర్పంచ్ ఫక్రుద్దీన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి ఆలయం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### - భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

### - భద్రాద్రి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 21 : గ్రామీణ ప్రాంత ప్రజలు, హిందువుల ఆరాధ్య దైవమైన పోచమ్మ తల్లి ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాద్రి జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం అందించారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, పోచమ్మ తల్లి విగ్రహాన్ని, ఆలయాన్ని ధ్వంసం చేసినటువంటి వారిని వదిలి పెట్ట వద్దని పోలీసులు కోరినట్లు తెలిపారు. చుంచుపల్లి మండల పరిధిలోని కార్మిక ప్రాంతంగా ఉన్న గౌతమ్ పూర్ లోని పోచమ్మ తల్లి ఆలయాన్ని ధ్వంసం చేయడం విచారకర్మన్నారు. మండల వ్యాప్తంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి హిందూ బంధువులు అందరిని కూడా ఏకం చేసి పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామన్నారు. దీనికి కారకులైన వారిని వెంటనే శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. దేవాలయాలను ధ్వంసం చేసే విధం గా కొంతమంది దుండగులు పాల్పడటం విచారకరమన్నారు. ఇలాంటి చర్యలను ఖండిస్తూ అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి నిరసన వ్యక్తం చేయాలని విజ్ఞప్తి చేశారు. పోచమ్మ తల్లిని గ్రామదేవతగా కొలిచే ఆనువాయితీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. గ్రామాల్లో ని తేజలు తమ్మి ఇళ్లలో ఏ శుభకార్యం జరిగిన పోచమ్మ తల్లికి పూజలు చేసినా అనంతరమే కార్యక్రమాలు మొదలు పెట్టుకుంటారని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈరోజు చిన్న ఆలయమే కదా అని వదిలేస్తే రేపు పెద్ద దేవాలయాలు కూడా ముప్పు పొంచి ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను వదిలి పెట్టవద్దని ఎస్పీకి అందించిన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో జాతోత్ వెంకన్న, బలగం శ్రీధర్, పొన్నకంటి రాజు, బడే రమేష్, మంగిలాల్ స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## ఓట్స్ అధికంగా తింటే అనర్థాలు.. జాగ్రత్త!



ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు.

**అతిగా ఓట్స్ తింటే అనర్థాలు**

ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం. ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం. ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి.

**అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు**

ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు. ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది.

**ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్**

ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది.

మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.

## పాలక్ కోకోనట్ రైస్..తక్కువ టైంలో ఎక్కువ రుచి..ఎలా చేసుకోవాలంటే



పాలక్ కోకోనట్ రైస్ రైస్ ఒక సుగంధభరితమైన, రుచికరమైన వంటకం. ఇది పాలకూర, కొబ్బరి పాల కలయికతో ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. ఇది లంచ్ బాక్స్ ల్లోకి, తేలికపాటి భోజనానికి లేదా ప్రత్యేక సందర్భాలలో వడ్డించడానికి కూడా చాలా బాగుంటుంది. దీనిని తయారు చేయడం చాలా సులభం, తక్కువ సమయంలోనే సిద్ధం చేసుకోవచ్చు. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు -బాస్మతి బియ్యం - 2 కప్పులు -పాలకూర - 2 కప్పులు -కొబ్బరి పాలు - 1.5 కప్పులు -ఉల్లిపాయ - 1 పెద్దది -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్ -ఆవాలు - 1 టీ స్పూన్ -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1/2 టీ స్పూన్ -శనగపప్పు - 1/2 టీ స్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు -పసుపు - 1/4 టీ స్పూన్ -ఉప్పు - రుచికి సరిపడా -కొత్తిమీర - గార్నిష్ కోసం -జీడిపప్పు - 1 టేబుల్ స్పూన్ -నిమ్మరసం - కొన్ని చుక్కలు.

తయారీ విధానం -ముందుగా బాస్మతి బియ్యాన్ని 2-3 సార్లు శుభ్రంగా కడిగి అరగంటసేపు నీటిలో నానబెట్టండి. -తర్వాత పాలకూరను శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన పెట్టుకోండి. మీరు కావాలనుకుంటే పాలకూరను కొద్దిగా ఉడికించి లేదా ఆవిరిలో మగ్గించి కూడా ఉపయోగించవచ్చు. -ఇప్పుడు ఉల్లిపాయను సన్నగా తరుగుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీల్చండి. అల్లం,వెల్లుల్లిని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఎండుమిర్చిని చిన్న ముక్కలుగా తుంచుకోండి. -స్టవ్ మీద ఒక మందపాటి అడుగు కలిగిన గిన్నె లేదా కుక్కర్ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేసి వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత జీలకర్ర, మినపప్పు, శనగపప్పు వేసి అవి కొద్దిగా రంగు మారే వరకు వేయించండి. ఇప్పుడు ఎండుమిర్చి,కరివేపాకు వేసి వేయించండి. తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు ఇందులో తరిగిన పాలకూర వేసి 2-3 నిమిషాలు లేదా అది మెత్తబడే వరకు ఉడికించాలి. -పాలకూర మగ్గిన తర్వాత కొబ్బరి పాలు పోయాలి. తర్వాత నానబెట్టిన బియ్యంలోని నీటిని వడగట్టి బియ్యం వేయాలి. పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. -గిన్నెకు మూత పెట్టి లేదా కుక్కర్ మూత పెట్టి మీడియం మంట మీద ఉడికించాలి. మీరు గిన్నెలో ఉడికిస్తుంటే నీరు పూర్తిగా ఇంకిపోయి అన్నం మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఇది సుమారు 15-20 నిమిషాలు పట్టవచ్చు. మీరు కుక్కర్ లో ఉడికిస్తుంటే 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. ప్రెజర్ పూర్తిగా తగ్గిన తర్వాత మూత తీయండి. -అన్నం ఉడికిన తర్వాత ఒకసారి మెల్లగా కలపండి. సన్నగా తరిగిన కొత్తిమీర, వేయించిన జీడిపప్పు పలుకులతో గార్నిష్ చేయండి. కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం పిండితే మరింత రుచిగా ఉంటుంది. -పాలక్ కొబ్బరి అన్నం వేడి వేడిగా రైతా, పెరుగు లేదా ఏదైనా కూరతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

తెలుగు వంటలు

## రాగి పిండితో హెల్దీ బన్ దోశలు..

### పీకలదాకా తిన్నా ఇంకోటి కావాలంటారు..ఎలా చేయాలంటే




మన ఆరోగ్యం మొత్తం దాదాపు మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. కరోనా తర్వాత నుంచి అధికశాతం మంది తమ ఆరోగ్యంపై ఎక్కువ ఫోకస్ పెడుతూ హెల్దీ ఫుడ్ తీసుకుంటున్నారు. హెల్దీ ఫుడ్స్ లో రాగి పిండితో చేసే బన్ దోశలు కూడా ఒకటి. సాధారణంగా పొద్దున్నే పూరీ,బోండా,ఇడ్లీ,బియ్యం పిండితో దోశ వంటివి మనం తింటుంటాం. అయితే ఇవి కాకుండా పొద్దున్నే రాగిపిండితో చేసే హెల్దీ బన్ దోశలు ఓ సారి టేస్ట్ చేసి చూడండి..అస్సలు వదలిపెట్టరు. అంత రుచిగా ఉంటాయి..అంతేకాకుండా ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. రాగి పిండిలో ఐరన్, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాంటి రాగి పిండితో హెల్దీ బన్ దోశలు ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి. రాగి పిండితో బన్ దోశలు తయారీకి కావాల్సిన పదార్థాలు -రాగి పిండి -బొంబాయి రవ్వ -పెరుగు -నీళ్లు -ఆవాలు -జీలకర్ర -కరివేపాకు -ఆయిల్ -ఇంగువ -పచ్చిమిర్చి. రాగి పిండితో బన్ దోశలు తయారీ విధానం -రాగి బన్ దోశలు తయారుచేయడం కోసం ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకొని అందులో అరకప్పు బొంబాయి రవ్వ, 1 కప్పు రాగి పిండి, 1 కప్పు పెరుగు వేసి మొత్తం కలిసేలా కలుపుకున్నాక ఇందులో అరకప్పు నీళ్లు పోసి బాగా కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టేయాలి. -10 నిమిషాలు నానిన తర్వాత ఈ పిండిని మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు ఏమీ వేయకుండానే దోశ పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండిని గిన్నెలోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో ఒకటిన్నర స్పూన్ ఆయిల్ వేడి చేసి ఇందులో కొద్దిగా ఆవాలు,జీలకర్ర వేసి అవి చిటపటలాడిన తర్వాత కొద్దిగా ఇంగువ వేసి కలిపాక 2 పచ్చిమిర్చి తరుగు,కొద్దిగా కరివేపాకు వేసి ఫ్రై అయ్యాక ఇందులో చిన్నగా కట్ చేసిన 1 టమాటో ముక్కలు వేసి అవి కొంచెం మెత్తబడేదాకా ఫ్రై చేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.ఈ తాళింపుని ముందుగా రెడీ చేసుకున్న పిండిలో వేసేయాలి. ఇందులోనే సన్నగా కట్ చేసిన 2 ఉల్లియాల ముక్కలు, కొత్తిమీర తరుగు,రుచికి తగినట్లుగా ఉప్పు, కొద్దిగా వంటసోడా వేసి పిండిలో అన్నీ బాగా కలిసేలా కలుపుకోవాలి. - ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాండీ పెట్టి అందులో కొంచెం ఆయిల్ వేసి దానిమీద పెద్ద గరిట పిండిని వేసుకొని ఒకవేపు కాలిన తర్వాత తిప్పుకొని దానిని రెండోవైపు కాల్చి దించేయాలి. అంతే రాగి బన్ దోశలు రెడీ. దీనిని మీకు నచ్చిన చట్నీతో కలిపి తింటే నోట్లో బ్లాస్టే.

## ఇది తినని మనిషి జన్మ ఎందుకు..

### మన పూర్వీకుల ఎనర్జీకి కారణం ఇదే..ఎలా చేసుకోవాలంటే




మీరెప్పుడైనా రాగిపిండి, సగ్గుబియ్యం కిచిడి తిన్నారా? సూపర్ టేస్ట్ ఉంటుంది. ఈ కిచిడి ఒక పోషకవైన,తేలికగా జీర్ణమయ్యే ఆహారం. రాగిలో ఐరన్, కాల్షియం,ఫైబర్ పుష్కలంగా ఉంటాయి..సగ్గు బియ్యం తక్షణ శక్తిని అందిస్తాయి. ఈ రెండింటి కలయికతో తయారైన కిచిడి రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రాగిపిండి సగ్గుబియ్యం కిచిడిని మీ ఇంట్లోనే సింపుల్ గా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీకి కావలసిన పదార్థాలు -పెసరపప్పు -సగ్గుబియ్యం -రాగిపిండి -మిరియాలు -జీడిపప్పు -పచ్చిమిర్చి -నెయ్యి -అల్లం -పసుపు -క్యారెట్ -ఉల్లిపాయ -టమాటో -వెల్లుల్లి -జీలకర్ర -కరివేపాకు

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీ విధానం -ముందుగా ఓ ప్రెజర్ కుక్కర్ లో శుభ్రంగా కడిగిన అరకప్పు పెసరప్పు, అరకప్పు సగ్గు బియ్యం, 4 పచ్చిమిర్చి ముక్కలు, 1 టమాటో పెద్ద ముక్కలు, 1 ఉల్లిపాయ పెద్ద ముక్కలు, 1 క్యారెట్ ముక్కలు,కొన్ని అల్లం ముక్కలు, పొట్టు తీసిన 2 వెల్లుల్లి రెబ్బలు, 10-15 మిరియాలు, చిటికెడు పసుపు వేయాలి. ఇందులో ముక్కలు మునిగేదాకా నీళ్లు పోసి కలిపి మూతపెట్టి స్టవ్ మీద పెట్టాలి. -రెండు విజిల్స్ వచ్చాక స్టవ్ ఆఫ్ చేసేయండి. ప్రెజర్ అంతా పోయిన తర్వాత కుక్కర్ మూత తీసి ఉడికిన పప్పుని గుత్తితో మెత్తగా మాష్ చేసుకోవాలి. -తర్వాత మళ్లీ స్టవ్ ఆన్ చేసి అది ఉడకనివ్వాలి. ఉడికే సమయంలోనే అందులో అరకప్పు రాగిపిండి ఉండలేకుండా బాగా కలపుతూ మంటను సిమ్ లో పెట్టి ఉడికించుకోవాలి.

10 నిమిషాలు రాగిపిండిని అందులో బాగా ఉడికించుకున్నాక రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి దగ్గరపడేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 2-3 స్పూన్ల నెయ్యి వేడి చేశాక జీడిపప్పు,మిరియాలు వేసి ఫ్రై చేసుకోవాలి. -జీడిపప్పు వేగిన తర్వాత కరివేపాకు,జీలకర్ర వేసి వేయించుకొని తర్వాత ఈ తాళింపు మొత్తాన్ని ముందుగా ఉడికించిన కిచిడిలో వేసి కలుపుకోవాలి. ఇందులో అరచెక్క నిమ్మరసం పిండి బాగా కలుపుకోవాలి. అంతే రాగి పిండి సగ్గుబియ్యం కిచిడి రెడీ.

# సినిమా న్యూస్



## అందాల డోస్ పెంచిన శ్రీలీల.. ఫ్యాన్స్ ఫిదా!



టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల లేటెస్ట్ ఫోటోషూట్‌తో నెటిజన్ల మనసు గెలుచుకుంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రమోషన్ల కోసం ఆమె ధరించిన బేజ్ కలర్ అనార్కలీ డ్రెస్‌లో దేవకన్యలా మెరిసిపోతోంది. మృణాళిని రావు డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్‌లో శ్రీలీల లుక్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే లక్షలాది లైకులతో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. కేవలం డాన్స్‌తోనే కాదు, తన క్లాసీ లుక్స్‌తోనూ ఆమె మ్యాజిక్ చేస్తోంది.శ్రీలీల తాజా ఫోటోషూట్ చూస్తుంటే ఎవరైనా సరే వావ్ అనాల్సిందే. మృణాళిని రావు కలెక్షన్ నుంచి ఎంచుకున్న 'వల్లి అనార్కలీ' సెట్‌లో ఆమె చాలా ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. సిల్క్ ఫ్యాబ్రిక్‌తో చేసిన ఈ డ్రెస్‌పై ఉన్న హ్యాండ్ ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె అందాన్ని మరింత పెంచింది. దీనికి తోడు 'బిడాజిల్స్' అందించిన జువెలరీ పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. గ్లామర్ షోకు దూరంగా, ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో కూడా శ్రీలీల ఎంత గ్రేస్‌ఫుల్‌గా ఉండగలదో ఈ ఫోటోలు నిరూపిస్తున్నాయి.శ్రీలీల కేవలం అందానికే పరిమితం కాకుండా, వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఈ ఏడాది పవన్ కళ్యాణ్ సరసన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాతో ప్రేక్షకులను అలరించింది. అలాగే శివకార్తికేయన్ హీరోగా వచ్చిన 'పరాశక్తి' సినిమాలో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇక 1960ల నాటి రాజకీయ నేపథ్యంలో సాగే ఆ చిత్రంలో శ్రీలీల తన చలాకీతనంతో అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ రెండు సినిమాలు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ రికార్డు వ్యూస్ సాధిస్తుండటం విశేషం. టాలీవుడ్‌లో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను దక్కించుకుంది శ్రీలీల. స్టార్ హీరోలందరి సరసన వరుస ఆఫర్లు కొట్టేస్తూ దూసుకుపోతోంది. ఆమెలో ఉన్న ఎనర్జిటిక్ డాన్స్, చలాకీతనం చూసి మేకర్స్ సర్‌ప్రైజ్ అవుతున్నారు. గ్లామర్ పాత్రలైనా, నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ అయినా తనదైన స్టైల్‌లో న్యాయం చేస్తోంది. ఇక అందుకే ఇప్పుడు సోషల్ మీడియాలో ఆమె పెట్టిన ఫోటోలకు కేవలం 10 గంటల్లోనే దాదాపు 2 లక్షల లైకులు రావడం చూస్తుంటే ఆమె క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.మొత్తానికి శ్రీలీల తన అందం, అభినయంతో ఆడియెన్స్‌ను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. అటు సినిమాలతో, ఇటు సోషల్ మీడియా ఫోటోషూట్లతో నిరంతరం వార్తల్లో నిలుస్తోంది. గ్లామర్ డోస్ పెంచినా అది క్లాసీగా ఉండేలా చూసుకోవడం ఆమె ప్రత్యేకత. ఇదే జోరు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్‌గా శ్రీలీల నిలవడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. శ్రీలీల కెరీర్ ఇలాగే సక్సెస్‌ఫుల్‌గా సాగాలని మనమూ కోరుకుందాం!

## రెడ్ హాట్ పాలక్ బ్యూటీ




బాలీవుడ్‌లో సహాయ దర్శకురాలిగా కెరీర్‌ను ప్రారంభించి సముద్దగుమ్మ పాలక్ తివారీ. ఈ అమ్మడు తక్కువ సమయంలోనే బాలీవుడ్ ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. అంతిమ్ సినిమాకు సహాయ దర్శకురాలిగా వర్క్ చేస్తున్న సమయంలోనే ఈమెలో నటిని గమనించిన కొందరు ఆ దిశగా ప్రయత్నాలు చేయమని సలహా ఇచ్చారట. దాంతో ఈ అమ్మడు మెల్లగా మోడలింగ్, యాక్టింగ్ వైపు మళ్లింది. తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. మోడలింగ్‌లోనూ దూసుకు పోతుంది. చాలా తక్కువ సమయంలో సోషల్ మీడియాలో మంచి పాపులారిటీని ఈ అమ్మడు దక్కించుకుంది. హీరోయిన్స్‌కి ఏ స్థాయిలో ఇన్‌స్టాలో ఫాలోవర్స్ ఉంటారో ఆ స్థాయిలో ఈ అమ్మడికి ఫాలోవర్స్ ఉన్నారు అంటే ఈమె ప్రతిభ, అందం ఏంటో అర్థం చేసుకోవచ్చు. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఈ అమ్మడు ట్రెండ్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. ఇండస్ట్రీలో ఉన్న సంబంధాల కారణంగా సహాయ దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాలక్ తివారీ 2023లో సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన కిసీ కా భాయ్ కిసీ కి జాన్ సినిమాలో కీలక పాత్రలో కనిపించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత బిజ్లీ బిజ్లీ అనే మ్యూజిక్ వీడియోను చేయడం ద్వారా మరింతగా సోషల్ మీడియాలో పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇక రోసీ సినిమాలో నటించిన ఈమెకు నటిగా మరింత మంచి మార్కులు దక్కాయి. సోలో హీరోయిన్‌గా సినిమాలు చేయడం కోసం వెయిట్ చేస్తున్న ఈ అమ్మడు మరో వైపు మోడలింగ్ చేస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా ఫోటోలను, వీడియోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతున్న విషయం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 50 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న పాలక్ తాజాగా మరో అందాల ఆరబోత ఫోటో షూట్ ను చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. సాదారణంగా ముద్దుగుమ్మలు రెడ్ డ్రెస్‌లో కన్నుల విందు చేయడం మనం చూస్తూ ఉంటాం. ఇక పాలక్ తివారీ అంతకు మించి అన్నట్లుగా అందాల ఆరబోత చేయడం ద్వారా కన్నుల పండుగ అన్నట్లుగా ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ పాలక్ తివారీ సొంతం. అందుకే ఈ రెడ్ డ్రెస్‌లో అంతకు మించి అన్నట్లుగా అందంగా, ఆకర్షణీయంగా పాలక్ కనిపిస్తోందని నెటిజన్స్, ముఖ్యంగా ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. గతంలోనూ పాలక్ అందాల ఆరబోత ఫోటోలు, మోడలింగ్ ఫోటోలను షేర్ చేసింది. అయితే ఈ స్థాయిలో ఆ ఫోటోలు అందంగా కనిపించలేదని, ఈసారి రెడ్ హాట్ అన్నట్లుగా అనిపిస్తోంది అంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న ఈ అమ్మడికి ఎందుకు బాలీవుడ్ నుంచి బల్క్ ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు విచారం వ్యక్తం చేస్తున్నారు.

## పూరి రెండున్నర దశాబ్దాల ప్రయాణం!



తెలుగు సినీ పరిశ్రమలో మాస్ అనే పదానికి సరి కొత్త నిర్వచనం పరిచయం చేసిన దర్శకుడు పూరి జగన్నాథ్. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి అదే పరిశ్రమలో తానో బ్రాండ్ గా ఎదిగారు. తన కలం బలంతో దర్శకుల్లో స్టార్ హీరోల ఇమేజ్ నే మార్చేసిన ఓ కొత్త తరం దర్శకుడాయన. సిటీకి ఎంతో మంది కమీషనర్లు వస్తుంటారు...పోతుంటారు. కానీ చంటిగాడు లోకల్ అన్న డైలాగ్ లా -పరిశ్రమకు ఎంతో మంది దర్శకులు వస్తుంటారు. పోతుంటారు. కానీ పూరి అనేవాడు ఓ బ్రాండ్ అంటూ తన డైలాగ్ నే తన ఐడెంటీగా మార్చేసు కున్నాడు. హీరో క్యారెక్టరైజేషన్‌లో పూరి చూపించే వైవిధ్యం, రాసే పవర్ ఫుల్ డైలాగ్స్ పూరిని ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలబెట్టాయి. పూరి పరిశ్రమలోకి అడుగు పెట్టి నేటితో 26 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. పూరి కెరీర్ ప్రారంభంలోనే -బద్రి- వంటి సంచలన విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్‌ను మలుపు తిప్పారు. అటుపై రిలీజ్ అయిన -ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం-,- ఈ అమ్మాయి చాలా మంచి వాడు-వంటి చిత్రాలు ఆయనలోని సున్నితమైన భావోద్వేగాలను ఆవిష్కరించాయి. అయితే -ఇడియట్- సినిమాతో పూరి జగన్నాథ్ టాలీవుడ్ ముఖచిత్రాన్నే మార్చేశారు. అప్పటి వరకు ఉన్న పద్ధతి గల హీరో పాత్రలను పక్కన బెట్టి -పోకిరి- తత్వమున్న హీరోని పరిచయం చేసి యువతలో ఓ ఊపు తెచ్చారు. పూరి కెరీర్‌లో -పోకిరి- ఓ మైలురాయి. ఆ సినిమాతో మహేష్ ను మాస్ ప్రేక్షకులకు దగ్గర చేయడమే కాదు. అప్పటి వరకూ ఉన్న ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసిన చిత్రమది. మహేష్ ని వంద కోట్ల క్లబ్లో చేర్చిన చిత్రమది. ఈ చిత్రం తో పూరి జగన్నాథ్ ఇమేజ్ ను తెచ్చుకున్నారు. స్టార్ హీరోలెవరైనా సరే? తమలోని మాస్ కోణాన్ని బయటకు తీయాలంటే పూరి దగ్గరకు వెళ్లాల్సిందే అనే పరిస్థితిని సృష్టించారు. రవితేజను మాస్ మహారాజాగా మార్చడంలో, అల్లు అర్జున్‌ను -దేశముదురు-గా చూపించడంలో విజన్ స్పష్టంగా కనిపిస్తుంది. -అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి-, -శివమణి-, -చిరుత-, -టెంపర్- , -ఇస్మార్ట్ శంకర్- ఇలా ఎన్నో విజయాలు పూరి చూసాడు. -బిజినెస్ మ్యాన్- చిత్రం పూరికి జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన గౌరవాన్ని, గుర్తింపును తెచ్చి పెట్టాయి. పూరి ట్యాలెంట్ చూసే బిగ్ బీ అమితాచ్చన్ సైతం ఓ అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే.ఏ క్రియేటర్ జీవితంలోనైనా ఎత్తుపల్లాలు సహజం. పూరి జగన్నాథ్ కూడా వరుస అపజయాలను ఎదుర్కొన్నారు. ఒక దశలో ఆయన తీసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. కథల విషయంలో మొరటుతనం పెరిగిందనే విమర్శలు ఎదుర్కున్నారు. భారీ అంచనాలతో వచ్చిన -ఆంధ్రావాలా-, -పైసా వసూల్-, -లైగర్- సహా పలు సినిమాలు డిజాస్టర్‌గా నిలవడం పూరి కెరీర్‌ను కొంత ఇబ్బందుల్లో నెట్టింది. కానీ ఓటమిని అంగీకరిస్తూనే మళ్ళీ పుంజుకోవడం పూరి శైలి. పూరి జగన్నాథ్ దర్శకుడే కాదు. మంచి ఫిలాసఫర్ కూడా. ఆయన సినిమాల్లోని పాత్రలు సమాజానికి భిన్నంగా ఆలోచిస్తాయి. -పూరి ముసింగ్స్- పేరుతో ఆయన పంచుకునే ఆలోచనలు నేటి యువతను బాగా ఆకర్షిస్తున్నాయి. జీవితాన్ని, విజయాన్ని, అపజయాన్ని సమానంగా స్వీకరించే ఆయన వ్యక్తిత్వం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా? తనదైన శైలిలో సినిమాలు తీస్తూ వెండితెరపై నేటికి ఉనికిని చాటుకుంటూనే ఉన్నారు. మొత్తంగా పూరి జగన్నాథ్ 26 ఏళ్ల ప్రయాణం ఓ అద్భుతమైన పాఠం. టాలీవుడ్‌కి ఎందరో దర్శకులు వస్తుంటారు. వెళ్తుంటారు. కానీ పూరి జగన్నాథ్ సృష్టించిన -మ్యానరిజమ్స్- , -డైలాగ్స్- ఎప్పటికీ గుర్తుండిపోతాయి. పూరి మళ్ళీ బలమైన కథతో బాక్సాఫీస్ సత్తాను చాటాలని అభిమానులు కోరుకుంటున్నారు. తెలుగు సినిమా చరిత్రలో పూరి పేరు సంచలనంగానే నిలిచిపోతుంది. ప్రస్తుతం మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతితో హీరోగా పూరి -స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్- అనే సినిమా చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'రాకా' మ్యూజిక్‌కు వరల్డ్‌వైడ్ క్రేజ్.. సాయి అభ్యంకర్ క్లారిటీ!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ సినిమా మ్యూజిక్ గురించి సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఇచ్చిన అప్‌డేట్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. ఇంటర్నేషనల్ లెవల్‌లో సాంగ్స్ ఉండబోతున్నాయని, విదేశీ సింగర్స్ కూడా ఇందులో భాగం అవుతున్నారని ఆయన చెప్పడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. బన్నీ స్టైల్‌కు తగ్గట్టుగా మ్యూజిక్ అదిరిపోబోతోందని క్లారిటీ వచ్చేసింది. ఆ వివరాలు ఇలా వున్నాయి.. సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఈ సినిమా మ్యూజిక్ వర్క్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అట్లీతో జరిగిన మొదటి మీటింగ్‌లోనే సాంగ్స్ ఎలా ఉండాలో ఆయనకు ఒక క్లియర్ విజన్ ఉందని సాయి తెలిపారు. ఇక అల్లు అర్జున్ మ్యూజిక్ టేస్ట్ గురించి మనందరికీ తెలిసిందే. బన్నీకి సంగీతంపై ఉన్న పట్టు, ఆయన ఇష్టాఇష్టాలు ఈ సినిమా ఆల్బమ్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్తున్నాయని సాయి చెప్పారు. వీరిద్దరి అభిరుచికి తగ్గట్టుగా సాంగ్స్ చాలా పవర్‌ఫుల్‌గా వస్తున్నాయని సమాచారం.

# తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం

## 23న పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

చెన్నై,ఏప్రిల్ 21 : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్‌లోనూ మొదటి విడత ఎన్నికల ప్రచారానికి తెరపడింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. తమిళనాడులో తుదిరోజు అన్ని పార్టీల అగ్రనేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. తన నియోజకవర్గం కొళత్తూరులో చివరి రోజు ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే వారికి తానో ప్రమాదకారిని అని హెచ్చరించారు. అన్ని రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచే తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించేందుకు డీలిమిటేషన్‌పై కేంద్రం తీవ్రంగా ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిసామి పశ్చిమ తమిళనాడులో ముమ్మరంగా ప్రచారం చేశారు. అవినీతి డీఎంకే ప్రభుత్వ పాలనకు ముగింపు పలకాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని మోదీ, అమిత్ షా, విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు ఆయా కూటముల తరఫున రాష్ట్రంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు.

# కాళేశ్వరం కమిషన్‌పై నేడు తీర్పు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 21 : కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా, కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు వెలువడే తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో కోర్టు తీసుకునే నిర్ణయం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

మొదటిపేజీ తరువాయి

తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమాచారం. ఈ నెల 27వ తేదీన తెలంగాణ భవన్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ముగింపు సమావేశం పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే కీలక ఘట్టమని కేడర్ భావిస్తోంది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా గులాబీ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పునరుద్ధరించుకునే అవకాశం ఉంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై గులాబీ కేడర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలు రూపొందించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి బీఆర్ఎస్ కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ సమగ్ర సమీక్ష చేయనున్నారు.

# ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

మొదటిపేజీ తరువాయి

శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందుకోసం ఏకంగా ఏటా రూ.22 లక్షల కోట్లను ఖర్చుచేస్తోంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇంధన ప్రత్యామ్నాయ ఉత్పత్తులపై దృష్టి సారించాలి. కేవలం ఇథనాల్‌తోనే కాకుండా చెత్త నుంచి హైడ్రోజన్ తయారీ వంటి వినూత్న పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాల వినియోగం తగ్గించాలని గడ్కరీ అన్నారు. పెట్రోల్ ఉత్పత్తుల్లో 20 శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తోసిపుచ్చారు. అంతేకాకుండా ఆటోమొబైల్ కంపెనీలు వాహనాల ధరల మీదనే కాకుండా ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలకు అనుకూలంగా ఉండేలా నాణ్యమైన ఇంజన్ల తయారీపై దృష్టి సారించాలన్నారు.

# మహిళా బిల్లు వీగడానికి కాంగ్రెస్ కారణం

మొదటిపేజీ తరువాయి

చర్యలకు పూనుకుంటున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో హుందాగా వ్యవహరించలేదని, మహిళా రిజర్వేషన్ వల్ల ప్రధాని మోదీకి మంచి పేరు వస్తుందనే అడ్డుకున్నారంటూ ఎంపీ అరుణ మండిపడ్డారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. మహిళలను అవమానపరిచిన కాంగ్రెస్ పార్టీకి సమయం వచ్చినప్పుడు బుద్ధిచెప్పాలి. జీడీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌లో అధికంగా సీట్లు పెరగాలనే ఉద్దేశమా అని అన్నారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనేది కేవలం అపోహనే అన్నారు. ఈనెల 24న గవర్నర్ శివప్రతాప్ శుక్లా మహబూబ్ నగర్‌లో పర్యటించనున్నారు. 'ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్'లో గెలుపొందిన క్రీడాకారులకు గవర్నర్ బహుమతులు ప్రదానం చేస్తారు' అని ఎంపీ అరుణ వెల్లడించారు. ఆయన పర్యటనకు ప్రజలు హాజరు కావాలన్నారు.

# అబద్ధాలు చెప్పడంలో కెసిఆర్ దిట్ట

మొదటిపేజీ తరువాయి

72 ఏళ్ల వయసులోనూ కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన హయాంలోనే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆనాటి నుంచి కేసీఆర్ కోవర్టు. ఆయన పేరుకే కాంగ్రెస్.. నిజానికి బీఆర్ఎస్ కార్యకర్త అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్‌లో అక్రమాలను ఉత్తమ్ కొనసాగిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్ అనేది లేనేలేదు. రైతుల వద్ద కరెంట్ బిల్లు వసూలు చేయాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలు అడిగిన మహిళలపై దౌర్జన్యాలు చేయించారు. తెలంగాణలో రైతులను ఆదుకోలేదు కానీ, పంజాబ్‌కు వెళ్లి చెక్కులు ఇచ్చి వచ్చారని అర్వింద్ విమర్శించారు.

# తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

మొదటిపేజీ తరువాయి

ఈరోజు మంగళవారం సచివాలయం లో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహ కారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, ÷-లక్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

# బెంగాల్లో తొలిదశ ప్రచారానికి తెర

## - 23న 152 నియోజకవర్గాల్లో పోలింగ్
## - బైక్ ర్యాలీలపై ఇసి నిషేధం విధింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌కతా, ఏప్రిల్ 21 : అసెంబ్లీ ఎన్నికల పోరుకు పశ్చిమ బెంగాల్ సిద్ధమైంది. గురువారం జరగనున్న తొలిదశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. తొలిదశ పోలింగ్ ప్రచారపర్వం ముగిసింది. ఏప్రిల్ 23న బెంగాల్‌లో 152 నియోజకవర్గాల్లో తొలి దశ పోలింగ్ జరగనుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలకు ఉపక్రమించింది. బైక్ ర్యాలీలను పూర్తిగా నిషేధించింది. రాత్రిపూట రాకపోకలను నియంత్రించడం, బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపైనా ఆంక్షలు విధించింది. మంగళవారం నుంచే ఆ ఆంక్షలను అమలు చేయాలని ఎన్నికల విధుల్లో ఉండే ఆయా విభాగాలకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ నేపథ్యంలో సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు బైకులు, స్కూటర్లను రోడ్లపైకి అనుమతించరు. వైద్యసేవలు, కుటుంబ వేడుకలు, తదితర అత్యవసర కార్యక్రమాలకు హాజరయ్యే వారిని మాత్రమే అనుమతిస్తారు. బైక్ ర్యాలీలపై పూర్తిగా నిషేధం విధించారు. పగటిపూట బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపై ఆంక్షలు విధించారు. పాఠశాలలు, కాలేజీ విద్యార్థులను తీసుకెళ్లే వారికి మినహాయింపు ఇచ్చారు. పోలింగ్ రోజు కూడా ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఎన్నికల వేళ ఓటర్లపై బెదిరింపులకు పాల్పడటం, పోలింగ్‌కు వెళ్లే వారికి ఆటంకం కలిగించడం, జామింగ్‌లను నివారించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. మినహాయింపు కోరుకునే వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇరుకుగా ఉండే వీధుల్లో నగదు, మద్యం తరలించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు బైక్‌లను ఉపయోగించే అవకాశం ఉందని ఓ అధికారి పేర్కొన్నారు.

# ఆర్టీసీ సమ్మె యధాతథం

## ప్రభుత్వంతో చర్చలు విఫలం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 21 : తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అనివార్యం అయ్యింది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకు వెళుతున్నట్లు జెఎసి ప్రకటించింది. తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అంశం కీలక మలుపు తిరిగింది. టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలమవడంతో సమ్మె బాట పట్టాలని జేఏసీ నాయకులు నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వంతో జరిగిన తాజా చర్చల్లో సమస్యలకు తక్షణ పరిష్కారం కనిపించలేదని తెలిపారు. ఐఏఎస్ అధికారుల కమిటీ నాలుగు వారాల సమయం కోరగా, దానికి తాము అంగీకరించలేదని వెల్లడించారు. ఇప్పటికే చాలాకాలంగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, మరింత ఆలస్యం సహించలేమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. జేఏసీ నాయకుల ప్రకటన ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ కార్మికులు సమ్మె ప్రారంభించనున్నారు. ఈ సమ్మె తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రవాణా సేవలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మార్చి 13వ తేదీన సమ్మె నోటీస్ ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. సమ్మెకు ముందురోజే చర్చలకు పిలవడం సరైన విధానం కాదని జేఏసీ నాయకులు విమర్శించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గత్యంతరం లేక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అధికారుల కమిటీ సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పినా, స్పష్టమైన హామీ ఇవ్వలేదని తెలిపారు. జేఏసీ నాయకులు కార్మికులకు కీలక పిలుపునిచ్చారు. ఎలాంటి బెదిరింపులకు భయ పడవద్దని, సమ్మెను ఐక్యంగా కొనసాగించాలని సూచించారు. అన్ని డిపోల్లో సమ్మె విజయవంతం చేయాలని కోరారు. ఈ సమ్మె కారణంగా బస్సు సర్వీసులు నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయి. రోజువారీ ప్రయాణికులు ఇబ్బందులు పడతారు. ప్రైవేట్ రవాణాపై ఆధారపడాల్సి రావచ్చు. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య త్వరగా పరిష్కారించాలని ప్రయాణికులు ఆశిస్తున్నారు. కార్మికుల సమ్మె తెలంగాణలో కీలక పరిణామంగా మారింది. చర్చలు విఫలం కావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, జేఏసీ వైఖరి ఈ సమ్మె భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# నటుడు ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలు

## పంజాగుట్ట స్టేషన్‌లో నటి కరాటే కళ్యాణి ఫిర్యాదు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 21 : నటుడు ప్రకాష్ రాజ్ పవిత్రమైన రామాయణంపై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపుతున్నాయి. ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని ఆరోపిస్తూ నటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి హైదరాబాద్ లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల కోజికోడ్‌లో జరిగిన కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌లో ప్రకాష్ రాజ్ ప్రసంగిస్తూ.. రామాయణాన్ని వింతగా విశ్లేషించారు. ఒక చిన్నారుల నాటకాన్ని ఉటంకిస్తూ.. శ్రీరాముడు, లక్ష్మణుడు ఉత్తరాది నుండి వచ్చిన వలస కూలీలని, వారు దక్షిణాదికి వచ్చి రావణుడి తోటలో పండ్లు దొంగిలించారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, దీనికి జీఎస్టీ ని ముడిపెడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా అవుతున్నాయి. పవిత్ర ఇతిహాసాన్ని వక్రీకరించి, మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీసేలా ఆయన ప్రసంగం ఉందని కళ్యాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కరాటే కళ్యాణి పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ఎం. రామకృష్ణను కలిసి ఫిర్యాదును అందజేశారు. ప్రకాష్ రాజ్‌పై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 196 , 299 , 353 , ఐటీ చట్టం సెక్షన్ 67 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆమె కోరారు. రామాయణం అనేది కోట్ల మంది భారతీయుల విశ్వాసం. దానిని వక్రీకరించి మాట్లాడటం దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. వివాదాస్పద వీడియోలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ, సాక్ష్యాధారాలను పోలీసులకు సమర్పించారు. మత విశ్వాసాలను అవమానించేలా, మతాల మధ్య విద్వేషాలు పెంచేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రీల్స్ మోజులో బిల్డింగ్‌పై నుంచి పడ్డ బాలుడు

## చికిత్స పొందుతూ మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 21 : గంటలు తరబడి రీల్స్ స్క్రోల్ చేస్తూ టైం వేస్ట్ చేసేవారు కొందరైతే... రీల్స్ కోసం రిస్క్ చేసి ప్రాణాల మీదకు తెచుకునేవారు మరికొందరు. రీల్స్ కోసం రిస్క్ చేసి మరో బాలుడు ప్రాణాలు వదిలాడు. హైదరాబాద్ లో దారుణం జరిగింది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ బిల్డింగ్ పై నుంచి జారిపడి బాలుడు మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... హైదరాబాద్ లోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గాంధీ బొమ్మ బస్తీకి చెందిన 14 ఏళ్ళ బాలుడు మితున్ రీల్స్ చేస్తూ బిల్డింగ్ పైనుంచి పడి మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మిథున్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మితున్ బిల్డింగ్ మీద నుంచి కిందపడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాలుడి మృతదేహాన్ని బీహార్ కు తరలిస్తున్నారు బంధువులు. మితున్ మృతితో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎంపిటిసి, జడ్పిటిసిలకు సిద్ధం కండి

మొదటిపేజీ తరువాయి

అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని అన్నారు. 200 కోట్ల రూపాయల అభివృద్ధి పనులతో సింగూరు ప్రాజెక్ట్‌ను టూరిజం స్పాట్‌గా మారుస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.

# ఎందరో ఆత్మ బలిదానాలతో తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం పాలైందని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం మాత్రమే వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుందని ఆరోపించారు. ఇప్పుడు వాళ్లే నీతులు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 'నేను ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. నిజాయితీగా, నిక్కచ్చిగా ఉన్నాను కాబట్టి రాజకీయాలలో నిలబడగలిగాను' అని ఎమ్మెల్యే వెల్లడించారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉన్నానని.. అందుకే 35 ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో తప్పుడు పనులు చేసి తలవంపులు తీసుకువచ్చిన వారు చాలా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజకవర్గ ప్రజలు గర్వపడే విధంగానే నా పని తీరు ఉంటుంది' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.

# అప్పుడు కెసిఆర్‌కు..ఇప్పుడు రేవంత్‌కు

మొదటిపేజీ తరువాయి

లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

మొదటిపేజీ తరువాయి

ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు అన్నారు. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. జగిత్యాలలో బీఆర్ఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు. కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం స్ట్రీట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలోనైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

# అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. మేమేప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

# తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రజాలక్ష్యం




# భూ రికార్డుల్లో 'సువర్ణాధ్యాయం'!

**- కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్..రాష్ట్రంలో కొత్త శకం**

**- భూధార్‌తో రైతు హక్కుకు శాశ్వత భరోసా.. పాలేరు గడ్డపై సంస్కరణల జెండా**

**- ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 'భూభారతి' అమలుకు మంత్రి పొంగులేటి అంకురార్పణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, ఏప్రిల్ 21 : తెలంగాణ రెవెన్యూ చరిత్రలో మంగళవారం ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్న భూ తగాదాలకు చరమగీతం పాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్వే మ్యాప్ ఆధారిత రిజిస్ట్రేషన్' ప్రక్రియ పట్టాలెక్కింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని కుసుమంచి మండలం నుంచి ఈ విప్లవాత్మక మార్పుకు అంకురార్పణ చేశారు. రైతు జీవితం భూమితో ముడిపడి ఉందని, ఆ హక్కుకు సర్వే మ్యాప్ మరియు భూధార్‌తో రక్షణ కల్పించినప్పుడే రైతు కుటుంబానికి భవిష్యత్తుపై నమ్మకం కలుగుతుందని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

**మ్యాప్ ఉంటేనే రిజిస్ట్రేషన్.. వివాదాలకు శాశ్వత చెక్:** గతంలో రిజిస్ట్రేషన్ అంటే కేవలం కాగితాల మీద రాసుకునే దస్తావేజులు మాత్రమే ఉండేవి. దీనివల్ల సరిహద్దు వివాదాలు తలెత్తి రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ 'భూభారతి' చట్టం ద్వారా రిజిస్ట్రేషన్ సమయంలో ఆ భూమికి సంబంధించిన స్పష్టమైన సర్వే మ్యాప్ (ఎల్ పి ఎం) ఉండటాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా కూసుమంచి మండలం గట్టు సింగారం గ్రామంలోని సర్వే నంబర్ 156/ఇ/1 లో గల ఒక ఎకరా నాలుగు గుంటల భూమికి సంబంధించి రాష్ట్రంలోనే తొలి 'మ్యాప్ ఆధారిత' రిజిస్ట్రేషన్ జరిగింది. నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామానికి చెందిన రైతు భాగం కిషన్ రావు తన భూమిని, అదే గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావుకు విక్రయించగా.. తహసీల్దార్ కార్యాలయంలో భూమి హద్దులతో కూడిన మ్యాప్‌ను జతచేసి ప్రక్రియను పూర్తి చేశారు. దీనివల్ల భవిష్యత్తులో పొరుగు రైతులతో వచ్చే సరిహద్దు తగాదాలకు ఇకపై తావుండదు.

**భూమికి విశిష్ట గుర్తింపు... 'భూధార్'తో పక్కా భద్రత :**

మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్టే, ఇకపై ప్రతి భూకమతానికి ఒక విశిష్టమైన 'భూధార్' నెంబర్‌ను ప్రభుత్వం కేటాయిస్తోంది. కూసుమంచిలో జరిగిన ఈ చారిత్రక రిజిస్ట్రేషన్‌కు 795GCHDCUPJ7H0 అనే భూధార్ సంఖ్యను (భూ కమత పటము-1) కేటాయించారు. దీనివల్ల భూమి యజమాని వివరాలు, విస్తీర్ణంపై ఎలాంటి సందేహాలకు తావుండదు. యాజమాన్య హక్కులను శాశ్వతంగా నిర్ధారించడమే కాకుండా, ఎవరైనా స్వచ్ఛందంగా తమ ఆస్తుల సర్వే సర్టిఫికేట్ పొందాలనుకుంటే కూడా దరఖాస్తు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. ఈ విధానం ద్వారా భూ వ్యవహారాల్లో పూర్తిస్థాయి పారదర్శకత వస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్.. దేశానికే దిక్సూచి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఈ నెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంతో పాటు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో ఈ కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. పాతకాలపు గొలుసు సర్వేలకు స్వస్తి పలికి, అత్యాధునిక 'రోవర్ల' సహాయంతో కచ్చితమైన కొలతలు తీస్తున్నారు. ఈ వినూత్న విధానం త్వర

## కనీస వేతన సవరణ, కార్మిక చట్టాల అమలుకు పోరాడాలి - ఐఎఫ్‌టియు

**అఖిల భారత కార్మిక డిమాండ్స్ డే సందర్భంగా నిరసన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 21 : కనీస వేతన సవరణతో పాటు కార్మిక చట్టాల పకడ్బందీ అమలుకు ఐక్యంగా పోరాడాలని ఐఎఫ్టియు నాయకులు పిలుపునిచ్చారు. అఖిల భారత కార్మిక డిమాండ్స్ డే సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) జాతీయ కమిటీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని నటరాజ్ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమాలకు సంఘీభావం తెలపాలని అన్నారు. బీహార్, హర్యానా, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో కార్మికులు కనీస వేతనాల పెంపు, కార్మిక చట్టాల అమలుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా హర్యానాలోని గురుగ్రామ్ ప్రాంతంలో వేల సంఖ్యలో కార్మికులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కార్మిక సంఘ నాయకులపై కేసులు నమోదు చేయడం, నోటీసులు ఇవ్వడం, నిర్బంధించడం వంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేసి




పాత కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఈ కోడ్ల వల్ల కార్మికులకు కలిగే నష్టాలు ఇప్పటికే స్పష్టమయ్యాయని, అందుకే దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతమవుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో కూడా లేబర్ కోడ్ల అమలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కే. మల్లేష్, రాజేష్, గోపి, వెంకటేశ్వర్లు, శ్రీను, శ్రీరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' విజయవంతం

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 22 : నిర్మల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో సమర్థవంతంగా అమలవుతోందన్నారు. వివిధ శాఖల అధికారులు తమ తమ విభాగాల పరిధిలో చేపట్టిన పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పంచాయతీ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించామని, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించామన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన 'అరైవ్ అలైవ్' వారోత్సవాలు కూడా విజయవంతంగా సాగాయని పేర్కొన్నారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం అన్ని కార్యక్రమాలను సమయానికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీగా పాల్గొనడం సంతోషకరమని, రానున్న రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో 99 రోజుల ప్రత్యేక ప్రణాళికను విజయవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, డిపిఆర్ఓ విష్ణు వర్ధన్, డీపీఓ శ్రీనివాస్, ఆర్టిఓ ర్గాప్రసాద్, వైద్య శాఖ అధికారి సౌమ్య, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

**- రైతులను హెచ్చరించిన అధికారులు - క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి, ఏప్రిల్ 21 : ఫార్మాసిటీ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు ఇకపై అక్కడ వ్యవసాయం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఆర్డీవో అనంతరెడ్డి శనివారం స్వయంగా పరిశీలించారు. నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి అసైన్డ్ భూముల స్థితిగతులను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. గతంలోనే ఫార్మాసిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 14 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ భూములకు సంబంధించి రైతులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరిగిందని ఆర్డీవో గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందుకున్న రైతులు, రాబోయే వర్షాకాలం సీజన్‌లో సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు వేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నష్టపరిహారం పొందిన తర్వాత ఆ భూమిపై హక్కులు ప్రభుత్వానికే ఉంటాయని, కాబట్టి అక్కడ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ అయ్యప్పతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. గతంలో భూసేకరణ సమయంలో కొన్ని గ్రామాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. మెజారిటీ రైతులకు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూములను అభివృద్ధి పనులకు సిద్ధం చేస్తున్న తరుణంలో.. అక్కడ మళ్లీ సాగు చేపడితే పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులు ఎవరైనా ఆదేశాలు ధిక్కరించి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్**


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఏప్రిల్ 21 : రైతు రక్తాన్ని చెమటగా మార్చి పండించిన పంట మధ్య దళారీల దోపిడీకి గురి కావద్దనే లక్ష్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం పాలకుర్తి అంతర్గాం మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించుకోవాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి సర్పంచ్ మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఐకెపి మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, చీఫ్ ఎలెక్టోరల్ కార్యాలయ అధికారులు


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, ఏప్రిల్ 22 : నిర్మల్ కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని మంగళవారం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, చీఫ్ ఎలెక్టోరల్ కార్యాలయ ఈవీఎం రాష్ట్ర నోడల్ అధికారి బి. హరిసింగ్ లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈవీఎం గోదాం తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, బిజెపి, టీడీపీ, ఆమ్ ఆద్మీ, ఎంఐఎం పార్టీల ప్రతినిధులు కోరిపల్లి శ్రవణ్ రెడ్డి, సిరికొండ రమేష్, హైదర్, మజార్, ముజాయిద్ అలీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌ను కలిసిన విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, ఏప్రిల్ 21 : తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డా.గడ్డం వివేక్ వెంకట స్వామిని తెలంగాణ అంబేద్కర్ సచివాలయంలో నేషనల్ మాల విద్యుత్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుల విజయభాస్కరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణలోని విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు తగిన వైద్య సదుపాయాలు లేకపోవడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించిన బ్యాక్లాగ్ పోస్టులను తక్షణం భర్తీ చేయాల్సిన అవసరం, అలాగే ఆర్టిసన్ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను వివరించారు. అదేవిధంగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో త్వరలో ప్రారంభించనున్న సంఘ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా మంత్రివర్యులను ఆహ్వానించారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు.

## వేసవి దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి

**రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 21 : రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయనీ, వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణంలోని శాస్త్రి రోడ్డులో రైస్ మిల్లు యజమాని దివంగత నరిగే (మిల్లు) కృష్ణ, సరోజినీ దేవి, సోని భవాని ల జ్ఞాపకార్థం, వారి కుమారులు ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ప్రతి డివిజన్ ప్రధాన కూడళ్ళలో చలివేంద్రాలు ఏర్పాటు చేసే అవసరం ఏంతైనా ఉందన్నారు. చలివేంద్రాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని కొత్వాలఅన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లు యజమాని నరిగే శ్రీనివాసరావు, నరిగే రమేష్, నరిగే రవీందర్, నరిగే సుజాత, లింగా రమేష్, సిహెచ్ వెంకటేశ్వర్లు, చీకటి బాబు, కొప్పరపు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి..

**మున్సిపల్ చైర్ పర్సన్ అంక మౌనిక**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, ఏప్రిల్ 21 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు వంశీ మాధవ్ తో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, హాస్పిటల్లో పనిచేసే నర్సులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బంది కలిగించవద్దని అన్నారు. రోగులకు అన్ని సదుపాయాలు కల్పించాలని, మందుల కొరత లేకుండా చూడాలని అన్నారు. అనంతరం ఆస్పత్రిలో చేరిన రోగులను, గర్భిణీ స్త్రీలను పరామర్శించి, వారికి అందుతున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుమ్ముల ఆనంద్, షోయబ్ హుస్సేన్, బొప్పారం సత్యవతి, తొడసం ఇందిరా, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, నాయకులు ప్రకాష్ తదితర ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



## జీవితాన్ని ప్రేమిద్దాం... మత్తును వీడుదాం

**ఎస్సై యు ఉపేందర్ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 21 : ములుగు మండలం లోని కాసిందేవిపేట గ్రామం యువతకు మాదకద్రవ్యాలు,డ్రగ్స్, సైబర్ నేరాలు,రోడ్డు భద్రత నియమాలపై మంగళవారం ములుగు ఎస్సై యు.ఉపేందర్ రావు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు బానిసలై బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, గ్రామంలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించిన సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోని ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్,పోలీస్ సిబ్బంది, ప్రజలు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## గంగారం సెక్టార్‌లో డీడబ్ల్యూఓ ఆకస్మిక పర్యటన

**అంగన్వాడీ కేంద్రాల తనిఖీల్లో సంతృప్తి వ్యక్తం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఏప్రిల్ 21: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని గంగారం సెక్టార్‌లో అంగన్వాడీ కేంద్రాలను స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి (డీడబ్ల్యూఓ) విజేత మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన ఆమె, చిన్నారులతో కలిసి కూర్చొని మాట్లాడారు. పిల్లలకు గుడ్డు, పౌష్టికా హారం సమయానికి అందిస్తున్నారా, ఆటల ద్వారా బోధన జరుగుతోందా అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు సానుకూలంగా స్పందించడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. కేంద్రాల్లోని పిల్లల బరువును తూకం వేసి పరిశీలించిన డీడబ్ల్యూఓ, లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై వివరాలు సేకరించారు. అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడిన ఆమె, విధుల్లో ఎలాంటి అక్రమాలు, నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని సూచించారు. ఎక్కడైనా అలసత్వం కనబడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల అనంతరం మాట్లాడుతూ, మొత్తం కేంద్రాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎటువంటి లోపాలు గమనించలేదని తెలిపారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL**, Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com